APTEL 2009/31957

నీలగిరి వార్త

మన కోసం మన వార్త తెలుగు దినపత్రిక

neelagirivartha@gmail.com

ప్రచురణ : ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఎడిటర్ : గుంటోజు విష్ణుమూర్తి సంపుటి 20 సంచిక 47 మంగళవారం 3 నవంబర్ 2026 పేజీలు 8 వెల- 5 రూ



మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి పోలీసుల రికార్డు


3లో

మురసు తుపానుపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ


2లో

- 48 గంటల పాటు అధికారులు అప్రమత్తంగా ఉండాలి
- ప్రజలు ఇళ్లలోనే సురక్షితంగా ఉండాలి
- తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో హోంమంత్రి అనిత టెలికాన్ఫరెన్స్
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి
- తీరం దాటే సమయంలో గంటకు 110 కి.మీ. వేగంతో ఈదురుగాలులు వీచే అవకాశం
- విద్యుత్, మొబైల్ నెట్‌వర్క్ సేవల పునరుద్ధరణకు ప్రత్యేక ఏర్పాట్లు
- సముద్రంలోకి వేటకు వెళ్లొద్దు.. మత్స్యకారులకు హెచ్చరిక
- హోంమంత్రి అనిత

ఏఐ, డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేయాలి..

అమిత్ షాకు చిరంజీవి కీలక విజ్ఞప్తి

- ఏఐ దుర్వినియోగంపై కేంద్ర హోంమంత్రికి విజ్ఞప్తి
- డీప్‌ఫేక్‌లపై చిరంజీవి కీలక విజ్ఞప్తి
- కళాకారుల ఫొటోలు, వీడియోల మార్ఫింగ్‌పై ఆందోళన
- ఏఐ దుర్వినియోగానికి చెక్ పెట్టాలని డిమాండ్
- కఠిన చర్యలకు అమిత్ షా హామీ


2లో

అర్నబ్‌తో పోలిస్తే మురసు తుఫాను తక్కువ తీవ్రత



- దక్షిణ కోస్తా, రాయలసీమలో భారీ వర్షాలకు అవకాశం
- 50 టీఎంసీల మేర వరద ప్రవాహాలు వస్తాయని అంచనా
- సమర్థ నీటి నిర్వహణతో చెరువులు, రిజర్వాయర్లు నింపాలి
- ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్టమైన చర్యలు తీసుకోవాలి
- మురసు తుఫాను సన్నద్ధతపై ఆర్టీజీఎస్ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

అమరావతి, నీలగిరి వార్త

కోస్తాంధ్ర తీరంపై మురసు తుఫాను ప్రభావం తక్కువగానే ఉండే అవకాశం ఉందని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అర్నబ్ తుఫానుతో పోలిస్తే గాలులు, వర్ష తీవ్రత కూడా తక్కువగానే ఉన్నట్టు అంచనాలు ఉన్నాయని ఆయన పేర్కొన్నారు. సచివాలయంలోని ఆర్టీజీఎస్ కేంద్రం నుంచి ఉన్నతాధికారులు, జిల్లా కలెక్టర్లతో ముఖ్యమంత్రి సమీక్ష నిర్వహించారు.

దక్షిణ కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున యంత్రాంగం పూర్తి అప్రమత్తంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశించారు. తుపాను ప్రభావంతో వచ్చే వర్షాలను సమర్థంగా వినియోగించుకుని చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని సూచించారు. ఎక్కడా ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా పటిష్ట చర్యలు తీసుకోవాలన్నారు.

మిగతా 2లో

రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలు

-మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి

-బెంగళూరులో చికిత్స పొందుతున్న గోపికకు పరామర్శ

-రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

- రాప్తాడు విద్యార్థినిపై దాడి ఘటన ప్రభుత్వ వైఫల్యానికి నిదర్శనం
- పాఠశాలల్లోనే విద్యార్థినులకు రక్షణ లేకుండా పోయింది
- క్లాస్‌రూమ్‌లో విద్యుత్ రంపంతో బాలికపై దాడి అత్యంత హేయం
- బాలికకు అత్యుత్తమ వైద్యం ప్రభుత్వ ఖర్చుతో అందించాలి
- గంజాయి, మద్యం, బెల్ట్ షాపుల విస్తరణతో పెరుగుతున్న నేరాలు
- పోలీసు వ్యవస్థను రాజకీయ అవసరాలకు వాడుకుంటున్నారని విమర్శ
- రాప్తాడు నియోజకవర్గంలో 15--16 నెలల్లో తొమ్మిది దారుణ ఘటనలు
- 11 గంటల శస్త్రచికిత్సను తట్టుకున్న గోపిక ఆరోగ్యం క్రమంగా మెరుగుదల



బెంగళూరు,నీలగిరి వార్తరాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలకు అనంతపురం జిల్లా రాప్తాడు జడ్పీ హైస్కూల్‌లో విద్యార్థినిపై జరిగిన దాడి ఉదాహరణ అని మాజీ ముఖ్యమంత్రి, వైయస్సార్‌సీపీ అధ్యక్షుడు వైయస్ జగన్‌మోహన్‌రెడ్డి ఫైర్ అయ్యారు. స్కూల్‌తో సంబంధం లేని వ్యక్తి ఎలక్ట్రిక్ రంపం తీసుకొచ్చి, ఏకంగా క్లాస్‌రూమ్‌లోనే, పిల్లలందరి ముందు పదవ తరగతి విద్యార్థిని గొంతు కోయడం అత్యంత హేయమని ఆయన ఆక్షేపించారు. చివరకు స్కూళ్లలో కూడా పిల్లలకు రక్షణ లేకుండా పోయిందని ఆందోళన వ్యక్తం చేశారు. రాప్తాడు జడ్పీ హైస్కూ ల్‌లో ఉన్మాది చేతిలో తీవ్రంగా గాయపడి బెంగళూరులోని మణిపాల్ ఆస్పత్రిలో

- మిగతా 2లో పేజీలో

అమిత్ షా.. తెలంగాణకు ఇచ్చిన నిధులెన్ని?:

మంత్రి పొన్నం సూటి ప్రశ్న

- కేంద్ర నిధులపై పొన్నం నిలదీత
- బీజేపీ హామీలపై సూటి ప్రశ్నలు
- SIR ప్రక్రియపై పార్లమెంట్‌లో చర్చకు సవాల్
- అమిత్ షా పర్యటనపై మంత్రి విమర్శలు



మిగతా 2లో

హైదరాబాద్: నీలగిరి వార్త నగరంలో కేంద్ర హోంమంత్రి అమిత్ షా పర్యటన కాంగ్రెస్ ప్రభుత్వాన్ని విమర్శించడానికే పరిమితమైందని రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. కాంగ్రెస్‌పై అనేక ఆరోపణలు చేసిన అమిత్ షా.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన హామీలపై ఎందుకు మాట్లాడలేదని ప్రశ్నించారు. తెలంగాణకు కేంద్రం ఇచ్చిన నిధులెన్ని, రాష్ట్రం నుంచి వసూలు చేస్తున్న పన్నులెన్నో

అప్రమత్తతతో వ్యవహరించండి

అత్యంత భారీ వర్షాల హెచ్చరికలు ఉన్న ప్రాంతాల ప్రజల్ని అప్రమత్తం చేయండి

లోతట్టు ప్రాంతాల ప్రజల్ని సురక్షిత ప్రాంతాలకు తరలించాలి

ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ సమీక్ష

- అత్యంత భారీ వర్షాల హెచ్చరికలున్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయండి
- లోతట్టు ప్రాంతాల ప్రజలను తక్షణమే సురక్షిత ప్రాంతాలకు తరలించాలి
- తుపాను ప్రభావిత జిల్లాల అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి
- పోలీస్, రెవెన్యూ, విద్యుత్ శాఖలతో సమన్వయంగా సహాయక చర్యలు



అమరావతి,నీలగిరి వార్త

అర్నబ్ తుపాను విధ్వంసం నుంచి రాష్ట్రం పూర్తిగా కోలుకోక ముందే మురసు రూపంలో మరో తుపాను ముప్పు రాష్ట్రానికి పొంచి ఉన్న నేపథ్యంలో విపత్తుని సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ, ఆర్.డబ్ల్యూఎస్ సిబ్బంది సన్నద్ధంగా ఉండాలని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి

మురసు తుపానుపై విద్యుత్ శాఖ అప్రమత్తం


2లో

- 48 గంటల్లో విద్యుత్ సరఫరా పునరుద్ధరణే లక్ష్యం
- విద్యుత్ లైన్లపై ప్రమాదకర చెట్లను వెంటనే తొలగించాలి
- 1912 కాల్‌సెంటర్ 24 గంటలూ అందుబాటులో ఉండాలి
- మూడు డిస్కంల సీఎండీలు, డైరెక్టర్లతో మంత్రి గొట్టిపాటి టెలికాన్ఫరెన్స్

కౌంటింగ్‌లో ప్రతి ఓటునూ కాపాడుకోవాలి

-ప్రజాతీర్పును పరిరక్షించాలి

-జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలపై మరింత దృష్టి పెట్టాలి

-ప్రతి ఓటు, ప్రతి వార్డు, ప్రతి డివిజన్ పార్టీకి కీలకమే

-రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి


2లో

రాష్ట్రంలో దారుణంగా క్షీణించిన శాంతి భద్రతలు

చికిత్స పొందుతున్న టెన్త్ విద్యార్థిని గోపికను వైయస్ జగన్ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడిన ఆయన బాలిక ఆరోగ్య పరిస్థితి గురించి ఆరా తీశారు. పాప ఆరోగ్యం కాస్త మెరుగ్గానే ఉందని వైద్యులు చెప్పడం, కాస్త సంతోషించతగిన విషయమన్నారు.

స్కూళ్లలో విద్యార్థుల భద్రత ఎక్కడ?:

పాఠశాలతో ఎలాంటి సంబంధం లేని వ్యక్తి ఏకంగా విద్యుత్ రంపం తీసుకుని హైస్కూల్‌లోకి ప్రవేశించి, బాలికలపై దాడి చేసే పరిస్థితి నెలకొంటే, ఇక స్కూళ్లలో చదువుకునే పిల్లల భద్రత ఏమిటి? అసలు పాఠశాలలోకి ఒక వ్యక్తి విద్యుత్ రంపంతో వస్తుంటే అడ్డుకునేవారే లేకపోవడం అత్యంత దారుణం. రాష్ట్రంలో ఇలాంటి దారుణ పరిస్థితులు నెలకొనడానికి ప్రధాన కారణం వెన్నుపోటు పార్టీ కూటమి ప్రభుత్వ వైఫల్యమే. ప్రతి గ్రామంలో, ప్రతి వీధిలో బెల్ట్ షాపులు విచ్చలవిడిగా విస్తరిస్తున్నాయి. గంజాయి, మద్యం అందుబాటులోకి రావడంతో యువత వ్యసనాలకు బానిసలవుతున్నారు. వాటిని అరికట్టాల్సిన ప్రభుత్వం పూర్తిగా విఫలమైంది. ఈ పరిస్థితుల వల్లే ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. వీటిని నియంత్రించలేకపోతున్నందుకు ప్రభుత్వం సిగ్గుతో తలదించుకోవాలి.బాలిక కుటుంబానికి రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి:ప్రభుత్వ వైఫల్యాల కారణంగా ఒక అమాయక బాలిక నేడు చావుబతుకుల మధ్య పోరాడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పాఠశాలలోకి బయటి వ్యక్తి ప్రవేశించి, విద్యుత్ రంపంతో దాడి చేసినా అడ్డుకోలేని దుస్థితి నెలకొంది. ఈ ఘటనకు ప్రభుత్వం బాధ్యత వహించాలి. ఆ దిశలో బాధిత బాలిక కుటుంబానికి ప్రభుత్వం తక్షణమే రూ.50 లక్షల పరిహారం అందించాలి. అంతే కాకుండా బాలికకు అవసరమైన అత్యుత్తమ వైద్య సేవలను పూర్తిగా ప్రభుత్వ ఖర్చుతో అందించాలి. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా నిలవాలి. ప్రభుత్వం నుంచి సరైన స్పందన రాని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆ కుటుంబానికి అండగా నిలుస్తుంది. బాలిక వైద్యానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తుంది. ఒకవేళ ప్రస్తుత ప్రభుత్వం రూ.50 లక్షల పరిహారం ఇవ్వకపోతే, వైయస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన నెల రోజుల్లోనే ఆ కుటుంబానికి రూ.50 లక్షలు అందిస్తాం. ఆ కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటాం.

రాప్తాడు నియోజకవర్గంలోనే 9 దారుణ ఘటనలు:



రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని అమలు చేస్తూ, శాంతిభద్రతలను పూర్తిగా గాలికొదిలేశారు. పోలీసుల దృష్టి శాంతిభద్రతల పరిరక్షణపై కాకుండా రాజకీయ వ్యవహారాలపై ఉండే పరిస్థితి తీసుకొచ్చారు. అందుకే రాష్ట్రంలో ఇలాంటి దారుణాలు జరుగుతున్నాయి. ఒక్క రాప్తాడు నియోజకవర్గంలోనే గత 15--16 నెలల్లో తొమ్మిది దారుణ ఘటనలు చోటుచేసుకున్నాయి. వాటిలో ఆరు ఘటనలు మహిళలు, బాలికలకు సంబంధించినవే కావడం ఆందోళనకరం.

మురసు తుపానుపై విద్యుత్ శాఖ అప్రమత్తం

అమరావతి,మురసు తుపాను నేపథ్యంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగకుండా, ప్రాణ, ఆస్తి నష్టాలను సాధ్యమైనంత వరకు నివారించేలా ముందస్తు చర్యలు చేపట్టాలని విద్యుత్ శాఖ అధికారులను మంత్రి గొట్టిపాటి రవికుమార్ ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని విద్యుత్ అధికారులు, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం ఏపీసీపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీలతో పాటు డిస్కంల ఉన్నతాధికారులు, డైరెక్టర్లతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తుపాను సన్నద్ధతపై సమీక్షించారు.తుపాను ప్రభావిత ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడితే యుద్ధప్రాతిపదికన పునరుద్ధరణ పనులు చేపట్టేందుకు ముందుగానే కార్యాచరణ సిద్ధం చేసుకోవాలని మంత్రి గొట్టిపాటి రవి కుమార్ సూచించారు. తుపాను ప్రభావం అధికంగా ఉండే జిల్లాలకు ప్రత్యేక అధికారులను నియమించాలని, డిస్కంల సీఎండీలు స్వయంగా క్షేత్రస్థాయిలో పర్యటించి పరిస్థితులను పర్యవేక్షి ంచాలని ఆదేశించారు. విద్యుత్ లైన్లపై ఉన్న ప్రమాదకర చెట్ల కొమ్మలను వెంటనే తొలగించి, గాలుల కారణంగా తీగలు తెగిపడటం, ఇతర ప్రమాదాలు సంభవించకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

అవసరమైన సామగ్రి ముందుగానే సిద్ధం:

విద్యుత్ పునరుద్ధరణకు అవసరమైన స్తంభాలు, కండక్టర్లు, ట్రాన్స్‌ఫార్మర్లు, కేబుళ్లు, ఇతర పరికరాలు, యంత్రాలను ముందుగానే అందుబాటులో ఉంచుకోవాలని మంత్రి గొట్టిపాటి సూచించారు. అత్యవసర పరిస్థితులను ఎదుర్కొనేందుకు తగిన సంఖ్యలో సిబ్బందిని సిద్ధం చేసుకోవాలన్నారు. అవసరమైతే తెలంగాణ, తమిళనాడు రాష్ట్రాల నుంచి అదనపు సిబ్బంది, యంత్రాలను రప్పించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని స్పష్టం చేశారు. తుపాను ప్రభావిత ప్రాంతాల్లో 48 గంటల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే లక్ష్యంతో అధికారులు పనిచేయాలని గొట్టిపాటి ఆదేశించారు. ఒక ప్రాంతంలో మరమ్మతులు పూర్తయిన వెంటనే సిబ్బందిని మరో ప్రాంతానికి తరలిస్తూ పనులు వేగవంతం చేయాలన్నారు. విద్యుత్ శాఖతో పాటు రెవెన్యూ, గ్రామ, వార్డు సచివాలయాలు, ఇతర ప్రభుత్వ విభాగాల అధికారులు సమన్వయంతో పని చేయాలని సూచించారు.

అప్రమత్తతతో వ్యవహరించండి

సరఫరా శాఖల మంత్రి పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. మురసు తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, మార్కాపురం, బాపట్ల, కృష్ణా జిల్లాల్లో అత్యంత భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందనే వాతావరణ శాఖ హెచ్చరించిన నేపథ్యంలో, ఆయా జిల్లాల యంత్రాంగం అత్యంత అప్రమత్తంగా ఉండాలని, లోతట్టు ప్రాంతాల ప్రజల్ని తక్షణం సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. పోలీస్, రెవెన్యూ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుంటూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని దిశానిర్దేశం చేశారు.అవసరం ఉన్న చోట పునరావాస కేంద్రాల ఏర్పాట్లు, తాగునీరు, భారీ వర్షాలకు దెబ్బతిన్న గ్రామీణ రోడ్లను తక్షణం పునరుద్ధరించడం, రోడ్లపై చెట్లు కూలితే తక్షణం తొలగించడం వంటి చర్యల్లో భాగస్వామ్యం కావాలని తెలిపారు. మురసు తుపాను ఈ రోజు తీరం తాకనుందన్న హెచ్చరికల నేపథ్యంలో తన పరిధిలోని అన్ని శాఖల అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. తుపాను ప్రభావం ఉండనున్న జిల్లాల కలెక్టర్లను అప్రమత్తం చేశారు.

మురసు తుపాను మొదట బాపట్ల, మచిలీపట్నం మధ్య తీరం తాకుతుందని అంచనా వేయగా, ప్రస్తుతం తుపాను దిశ మార్చుకుని నెల్లూరుకు సమీపంగా తీరం దాటబోతోందని, తుపాను ప్రభావంతో నెల్లూరు, ప్రకాశం, బాపట్ల, తిరుపతి, మార్కాపురం జిల్లాల్లో ఇప్పటికే భారీ వర్షాలు కురుస్తున్నాయని అధికారులు వివరించారు. వాతావరణ శాఖ అంచనాల మేరకు ఈ మధ్యాహ్నం తుపాను తీరాన్ని దాటే అవకాశం ఉందని తెలిపారు. తీరాన్ని తాకే సమయంలో గంటకు 100 నుంచి 120 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని, అత్యంత భారీ వర్షాలు కురిసి, ఆకస్మిక వరదలకు అవకాశాలు ఉన్నాయని చెప్పారు.

ఇప్పటికే లోతట్టు ప్రాంతాల ప్రజలకు హెచ్చరికలు జారీ చేసినట్టు తెలిపారు. ముందస్తు చర్యల్లో భాగంగా ఇప్పటికే ఆరు ఎన్డీఆర్ఎఫ్, ఏడు ఎస్డీఆర్ఎఫ్ బృందాలను సిద్ధంగా ఉంచినట్టు వివరించారు.అర్నబ్ తుపాను మాదిరి మురసు తుపానును కూడా సమర్థవంతంగా ఎదుర్కొ నేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని, గ్రామాల్లో తాగునీటికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలని ఉప ముఖ్యమంత్రి స్పష్టం చేశారు.

కౌంటింగ్‌లో ప్రతి ఓటునూ కాపాడుకోవాలి

తాడేపల్లి,స్థానిక సంస్థల ఎన్నికల కౌంటింగ్‌లో ప్రతి ఓటునూ కాపాడుకునేలా పార్టీ నాయకులు, కౌంటింగ్ ఏజెంట్లు పూర్తి అప్రమత్తతతో వ్యవహరించాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి సూచించారు. ఈనెల 3న జరిగే కౌంటింగ్‌తో పాటు 5న జరగనున్న జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికలను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని పిలుపునిచ్చారు. ఎన్నికల ఫలితాలు ఎలా ఉన్నా నిరుత్సాహపడకుండా, ప్రతి ఓటును, ప్రతి స్థానాన్ని కీలకంగా భావించి పోరాడాలని స్పష్టం చేశారు.

సోమవారం పార్టీ జిల్లా అధ్యక్షులు, ఎమ్మెల్యేలు, అసెంబ్లీ నియోజకవర్గ సమన్వయకర్తలతో సజ్జల రామకృష్ణారెడ్డి టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో అధికార టీడీపీ వ్యవహరిస్తున్న తీరుతో పాటు కౌంటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, రాబోయే జెడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల వ్యూహంపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా సజ్జల రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ నామినేషన్ల దశ నుంచే అధికార టీడీపీ ప్రజాస్వామ్య వ్యవస్థలను దుర్వినియోగం చేస్తోందన్నారు. గతంలో అక్కడక్కడా కనిపించిన అధికార దుర్వినియోగం ఈసారి వ్యవస్థీకృతంగా జరుగుతోందన్నారు. పోలీసు యంత్రాంగం, ఎన్నికల అధికారులు అధికార పార్టీకి అనుకూలంగా వ్యవహరించారని, కొన్ని చోట్ల టీడీపీ కార్యకర్తల్లా పనిచేశారన్నారు. నామినేషన్ల తిరస్కరణ, బలవంతపు ఉపసంహరణల నుంచి పోలింగ్ రోజు దొంగ ఓట్ల ప్రయత్నాల వరకు అనేక అక్రమాలు చోటుచేసుకున్నాయన్నారు. ఎన్నికల్లో గరిష్ట స్థాయిలో పోటీ జరిగేలా చూడాల్సిన అధికారులు అందుకు విరుద్ధంగా వ్యవహరించడంతో అనేక చోట్ల గందరగోళ పరిస్థితులు ఏర్పడ్డాయన్నారు. మరికొన్ని చోట్ల జెడ్పీటీసీ అభ్యర్థులు లేకుండా జెడ్పీటీసీ ఎన్నికలు జరుగుతున్నాయని చెప్పారు.

అర్నబ్‌తో పోలిస్తే మురసు తుఫాను తక్కువ తీవ్రత

అర్నబ్ తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో ఇప్పటికే చాలా వరకు సాధారణ పరిస్థితులు నెలకొన్నాయని సీఎం తెలిపారు. అర్నబ్ ప్రభావాన్ని ఎదుర్కొనేలా శ్రీకాకుళం నుంచి బాపట్ల వరకు ముందస్తు ఏర్పాట్లు చేశామని, ఇప్పుడు మురసు తుఫాను ప్రభావాన్ని కూడా సమర్థంగా ఎదుర్కోవాలని స్పష్టం చేశారు. అర్నబ్ తుఫాను కారణంగా శ్రీకాకుళం నుంచి కృష్ణా జిల్లా వరకు 31 వేల విద్యుత్ స్తంభాలను క్షేత్రస్థాయికి పంపించామని అధికారులు వివరించారు. మురసు తుఫాను గాలుల ప్రభావం దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల్లోని సుమారు 8 వేల విద్యుత్ స్తంభాలపై పడే అవకాశం ఉందని అధికారులు అంచనా వేశారు. విద్యుత్ పునరుద్ధరణ కోసం చెన్నై నుంచి మరో వెయ్యి మంది సిబ్బంది వస్తున్నారని, వారిని నెల్లూరు, ప్రకాశం సహా వివిధ జిల్లాల్లో వినియోగించాలని సీఎం సూచించారు.

పల్నాడులో అత్యధిక వర్షపాతం అంచనా:

మురసు తుపాను ప్రభావంతో పలు జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పల్నాడు జిల్లాలో 30 సెంటీమీటర్లు, ప్రకాశంలో 24, మార్కాపురంలో 19, కృష్ణా, గుంటూరు జిల్లాల్లో 9 సెంటీమీటర్ల వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం ఉందని వివరించారు. ఏలూరులో 9 సెం.మీ., నెల్లూరులో 9 సెం.మీ. మేర వర్షాలు కురిసే సూచనలు ఉన్నాయన్నారు. భారీ వర్షాలు కురిసే ప్రాంతాల్లో డ్రెయిన్లను ముందుగానే శుభ్రం చేయాలని, వాగులు, వంకలు పొంగి ప్రవహించే ప్రాంతాల్లో అప్రమత్తంగా ఉండాలని సీఎం ఆదేశించారు. నాగార్జునసాగర్, పులిచింతల ప్రాజెక్టుల పరిధిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున 30 టీఎంసీల నుంచి 50 టీఎంసీల వరకు నీటి ప్రవాహాలు రావచ్చని అధికారులు అంచనా వేశారు. పులిచింతలలో 18 టీఎంసీల మేర ఫ్లడ్ కుషన్ అందుబాటులో ఉందని, నాగార్జునసాగర్‌కు కూడా భారీగా ప్రవాహాలు వచ్చే అవకాశం ఉందని తెలిపారు. గుండ్లకమ్మ ప్రాజెక్టుకు 1.5 లక్షల క్యూసెక్కుల వరకు ఇన్‌ఫ్లో రావచ్చని అంచనా వేస్తున్న నేపథ్యంలో నీటి నిర్వహణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సీఎం సూచించారు. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, మార్కాపురం జిల్లాల్లో వర్షపాతం లోటు ఉన్నందున చెరువులు, రిజర్వాయర్‌లను నింపాలని ఆదేశించారు. దక్షిణ కోస్తా, రాయలసీమ బేసిన్‌లోని జలాశయాల్లో నీటిని నిల్వ చేసుకునేలా కార్యాచరణ రూపొందించాలన్నారు. మార్కాపురంలోని కంభం చెరువుతో పాటు ఆయా జిల్లాల్లోని మీడియం, మైనర్ ఇరిగేషన్ ట్యాంకులు పూర్తిస్థాయిలో నిండే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. పరివాహక ప్రాంతాల నుంచి వచ్చే వరద ప్రవాహాలను కంట్రోల్ రూమ్‌ల ద్వారా పర్యవేక్షించాలని సీఎం సూచించారు.

చెరువులకు గండ్లు పడకుండా చర్యలు:

మురసు తుఫాను ప్రభావం ఉన్న 6 జిల్లాల పరిధిలోని 6,800 చెరువుల భద్రతపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.

మురసు తుపానుపై ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ

అమరావతి, మురసు తీవ్ర తుపాను నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం పరిస్థితులను పర్యవేక్షిస్తోందని హోం, విపత్తుల నిర్వహణ శాఖ మంత్రి అనిత తెలిపారు. తుపాను ప్రభావిత జిల్లాల కలెక్టర్లతో ఆమె టెలికాన్ఫరెన్స్ నిర్వహించి, తీసుకోవాల్సిన ముందస్తు జాగ్రత్తలు, సహాయక చర్యలపై అధికారులకు దిశానిర్దేశం చేశారు. సోమ, మంగళవారాల్లో కోస్తాంధ్ర, రాయలసీమ జిల్లాల్లో భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. తుపాను అర్ధరాత్రి నుంచి తెల్లవారుజాము మధ్య ఒంగోలు సమీపంలో తీరం దాటే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించిన నేపథ్యంలో దక్షిణ కోస్తా, రాయలసీమ జిల్లాల కలెక్టర్లు అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. తుపాను ప్రభావంతో ఎలాంటి ప్రాణ, ఆస్తి నష్టం జరగకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని స్పష్టం చేశారు. తుపాను తీరం దాటే సమయంలో గంటకు 100 నుంచి 110 కిలోమీటర్ల వేగంతో బలమైన ఈదురుగాలులు వీచే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయిలో అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

విద్యుత్, సమాచార వ్యవస్థలపై ప్రత్యేక దృష్టి:

బలమైన గాలుల కారణంగా విద్యుత్ లైన్లపై చెట్లు విరిగిపడే ప్రమాదం ఉన్నందున ముందుగానే వాటిని తొలగించాలని మంత్రి అనిత అధికారులను ఆదేశించారు. విద్యుత్ సరఫరా, మొబైల్ నెట్‌వర్క్ సేవల్లో అంతరాయాలు ఏర్పడితే వెంటనే పునరుద్ధరించేలా చర్యలు చేపట్టాలని సూచించారు. ఈదురుగాలులకు విద్యుత్ వైర్లు తెగిపడే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, తెగిపడిన వైర్లను తాకకుండా దూరంగా ఉండాలని హెచ్చరించారు. ప్రమాదకర పరిస్థితులు కనిపించినా, ఏదైనా ప్రమాదం జరిగే అవకాశం ఉన్నా వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని కోరారు.

అమిత్ షా.. తెలంగాణకు ఇచ్చిన నిధులెన్ని?:

చెప్పాలని నిలదీశారు. కాంగ్రెస్ ఆరు గ్యారెంటీలపై తాము చర్చకు సిద్ధమని, బీజేపీ ఇచ్చిన హామీలపై సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. రైతులకు నెలవారీ పింఛన్లు, ఉచిత విద్యుత్, ప్రతి ఇంటికి రూ.15 లక్షలు ఇస్తామన్న హామీ ఏమైందని కేంద్ర హోంమంత్రిని ప్రశ్నించారు. పెట్రోల్ ధరను రూ.50కి తగ్గిస్తామన్న హామీ గుర్తులేదా? అంటూ నిలదీశారు.ఈ సందర్భంగా తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో ఏర్పడిన కరవు దృష్ట్యా కేంద్రం తక్షణమే సహాయం చేయాలని మంత్రి పొన్నం డిమాండ్ చేశారు. దేశంలో 12 ఏళ్ల పాలనలో బీజేపీ ప్రజాస్వామ్యానికి విఘాతం కలిగించిందని పేర్కొన్నారు. అయితే, కాంగ్రెస్ మాత్రం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటం కొనసాగిస్తోందని స్పష్టం చేశారు. విదేశీయుల ఓట్లు తొలగించామని బీజేపీ నేతలు చెబుతున్నారని, అయితే ఎంతమందిని దేశం నుంచి పంపించారో చెప్పాలని అమిత్ షాను డిమాండ్ చేశారు. చొరబాటుదారులకు ఓటు హక్కు కల్పించడాన్ని కాంగ్రెస్ వ్యతిరేకిస్తోందని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐఆర్ (ఱ×=) ప్రక్రియపై పార్లమెంట్‌లో చర్చకు సిద్ధమా? అంటూ మంత్రి పొన్నం సవాల్ విసిరారు.అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీల ఓట్లను తొలగించడంపైనే కాంగ్రెస్ ప్రశ్నిస్తోందని మంత్రి చెప్పుకొచ్చారు. బీజేపీ, ఆర్ఎస్ఎస్ కార్యాలయాల నుంచే ఓట్ల తొలగింపు ఫారాల పంపిణీ జరుగుతోందని ఆరోపించారు. ప్రధాని మోదీ, హోంమంత్రి అమిత్ షా పాలనలో అంబానీ, అదానీలకు దేశ సంపదను కట్టబెడుతున్నారని విమర్శించారు. దేశంలో మోదీ, అమిత్ షా ట్యాక్స్ నడుస్తోందని ధ్వజమెత్తారు. హైదరాబాద్‌లో అమిత్ షా పర్యటన పూర్తిగా విఫలమైందని మంత్రి పొన్నం వ్యాఖ్యానించారు.

ఏఐ, డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేయాలి..

అమిత్ షాకు చిరంజీవి కీలక విజ్ఞప్తి

హైదరాబాద్: కేంద్ర హోంమంత్రి అమిత్ షాను మెగాస్టార్ చిరంజీవి, మెగాపవర్ స్టార్ రామ్ చరణ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈరోజు (సోమవారం) హైదరాబాద్ పర్యటనకు వచ్చిన అమిత్ షాతో వారిద్దరూ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ఏఐ దుర్వినియోగం, డీప్‌ఫేక్‌లకు అడ్డుకట్ట వేయాలని చిరంజీవి కోరారు. కళాకారులను లక్ష్యంగా చేసుకుని అసభ్యకర రీతిలో ఫొటోలు, వీడియోలను మార్ఫింగ్ చేయడాన్ని కేంద్ర హోంమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు భేటీకి సంబంధించిన వివరాలను మెగాస్టార్ ఎక్స్ వేదికగా పంచుకున్నారు.

మెగాస్టార్ చిరంజీవి ఎక్స్ పోస్ట్..

'గౌరవనీయులైన కేంద్ర హోంమంత్రి అమిత్ షాను కలవడం ఎంతో గౌరవంగా భావిస్తున్నాను. ఏఐ, డీప్‌ఫేక్ టెక్నాలజీల దుర్వినియోగం వల్ల కళాకారుల హక్కులు, గౌరవం, సృజనాత్మక కంటెంట్ తీవ్ర ముప్పును ఎదుర్కొంటున్నాయి. ఈ అంశంపై నాకున్న ఆందోళనలను ఆయనకు వివరించాను. మేము వ్యక్తం చేసిన ఆందోళనలను అమిత్ షా ఎంతో శ్రద్ధగా ఆలకించారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిశీలించి, మరింత పటిష్టమైన రక్షణ చర్యలు, కఠినమైన శిక్షలు అమలు చేసే దిశగా ప్రభుత్వం కృషి చేస్తుందని హామీ ఇచ్చారు. ఈ అంశానికి సంబంధించి లిఖితపూర్వక వినతిపత్రం సమర్పించాలనీ సూచించారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డికి ఈ వ్యవహారాన్ని సమన్వయం చేసే బాధ్యతను అప్పగించారు. సినీ పరిశ్రమకు ఇది ఒక ప్రోత్సాహకరమైన ముందడుగు. ఈ విషయంలో హామీ ఇచ్చిన అమిత్ షాకు నా కృతజ్ఞతలు. త్వరలోనే కళాకారులకు అర్థవంతమైన, పటిష్టమైన రక్షణ చర్యలు అందుబాటులోకి వస్తాయని ఆశిస్తున్నాను' అని చిరంజీవి పేర్కొన్నారు.

జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:గిరిజనుల చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, స్వాతంత్ర్య పోరాటంలో వారి పాత్రను ప్రజలకు తెలియజేసే ఉద్దేశంతో నవంబర్ 1 నుంచి 15వ తేదీ వరకు జనజాతీయ గౌరవ దివస్ వేడుకలను జిల్లావ్యాప్తంగా ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ తెలిపారు. సోమవారం కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో జనజాతీయ గౌరవ దివస్ కార్యక్రమాలకు సంబంధించిన పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ఆవిష్కరించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గిరిజనుల గొప్ప చరిత్ర, వారసత్వ సంపద, సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు తెలియజేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు భగవాన్ బిర్సా ముండా చేసిన పోరాటం, త్యాగాలు, గిరిజన సమాజ అభ్యున్నతికి ఆయన చేసిన కృషిని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని పేర్కొన్నారు.

నవంబర్ 2 నుంచి 15వ తేదీ వరకు జిల్లాలోని పాఠశాల లు, కళాశాలలు, వసతి గృహాలు, గిరిజన గ్రామాల్లో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విద్యార్థులకు గిరిజన చరిత్ర, స్వాతంత్ర్య పోరాటంపై వ్యాసరచన, చిత్రలేఖనం, నినాదాలు, కథలు, కవితలు, క్విజ్ పోటీలు నిర్వహించాలని సూచించారు.

అదేవిధంగా గిరిజన కళలు, చేతివృత్తులు, సంగీతం, నృత్యాలపై ప్రత్యేక కార్యక్రమాలు, గిరిజన కళా ప్రదర్శనలు, పర్యావరణ పరిరక్షణ, మొక్కల నాటడం, పారిశుద్ధ్య



కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ కనబరిచిన గిరిజన ప్రముఖులు, కళాకారులను సన్మానించాలని తెలిపారు.నవంబర్ 15న భగవాన్ బిర్సా ముండా జయంతిని పురస్కరించుకొని జనజాతీయ గౌరవ దివస్‌ను ఘనంగా నిర్వహించి ఆయనకు ఘన నివాళులు అర్పించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, డిఆర్డిఓ దామోదర్ రెడ్డి, సీఈవో చందర్, ఎక్సైజ్ సూపరింటెండ్ ముకుంద రెడ్డి, డిఆర్ఓ పాండు, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి సౌజన్య, తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి పోలీసుల రికార్డు

రాష్ట్రంలోనే జిల్లా ప్రథమ స్థానం

కమిషనరేట్లు మినహా జిల్లాల వారీగా మొదటి స్థానంలో కామారెడ్డి జిల్లా

కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
జిల్లా ఎస్పీ యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్

సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా వినియోగించుకుంటూ బాధితుల బాధ్యతను తమ బాధ్యతగా స్వీకరించిన కామారెడ్డి జిల్లా పోలీసులు మొబైల్ ఫోన్ల రికవరీలో అరుదైన ఘనత సాధించారు. రాష్ట్రవ్యాప్తంగా పోలీస్ కమిషనరేట్లను మినహాయిస్తే, జిల్లాల ప్రాతిపదికన మొబైల్ ఫోన్ల రికవరీలో కామారెడ్డి జిల్లా రాష్ట్రంలోనే మొదటి స్థానంలో నిలిచిందని జిల్లా ఎస్పీ హర్షం వ్యక్తం చేశారు మొబైల్ ఫోన్ పోయిందని లేదా చోరీకి గురైందని ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సిఈఐఆర్ పోర్టల్ ద్వారా పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లను సులభంగా తిరిగి పొందవచ్చని కామారెడ్డి జిల్లా ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రస్తుత డిజిటల్ కాలంలో మొబైల్ ఫోన్ అనేది కేవలం సమాచార సాధనం మాత్రమే కాకుండా బ్యాంకింగ్ వివరాలు, వ్యక్తిగత ఫోటోలు, కీలకమైన డేటాను కలిగి ఉండే అత్యంత ముఖ్యమైన పరికరమని ఆయన పేర్కొన్నారు. ఫోన్ పోగొట్టుకోవడం వల్ల వ్యక్తిగత భద్రతకు, గోప్యతకు ముప్పు వాటిల్లే అవకాశం ఉన్నందున, జిల్లా పోలీసు యంత్రాంగం మొబైల్ ఫోన్ల రికవరీపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తోందని వివరించారు.

బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ఇన్‌స్పెక్టర్ సంపత్ పర్యవేక్షణలో, ఆర్ఎస్ఐ బాలరాజు మరియు ఐదుగురు కానిస్టేబుళ్లతో కూడిన ప్రత్యేక సాంకేతిక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. ఈ బృందం అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించి ప్రతి నెల సగటున 150 కు పైగా మొబైల్ ఫోన్లను రికవరీ చేస్తూ బాధితుల్లో నమ్మకాన్ని పెంపొందిస్తోందని కొనియాడారు.

జిల్లాలో రికవరీల గణాంకాలను వెల్లడిస్తూ.. ఇటీవల నిర్వహించిన ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా గత 45 రోజుల్లోనే ?42.24 లక్షల విలువైన 264 మొబైల్ ఫోన్లను రికవరీ చేశామని, అలాగే ఈ ఏడాది ఇప్పటివరకు సుమారు ?2.23 కోట్ల విలువైన 1397 మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. గత ఏడాది కూడా సుమారు ?3 కోట్ల విలువైన 1,834 మొబైల్ ఫోన్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామని గుర్తుచేశారు.

సీఈఐఆర్ పోర్టల్ అందుబాటులోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటివరకు కామారెడ్డి జిల్లాలో మొత్తం 5678 మొబైల్ ఫోన్లను ట్రాక్ చేసి, గుర్తించి సుమారు ?9.08 కోట్ల విలువైన ఫోన్లను బాధితులకు విజయవంతంగా అప్పగించడం జరిగిందని ఎస్పీ తెలిపారు. ఈ సందర్భంగా మొబైల్ రికవరీలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన



ప్రత్యేక బృందాన్ని ఆయన అభినందించారు.

మొబైల్ ఫోన్ పోయిన వెంటనే ప్రజలు అప్రమత్తంగా వ్యవహరించాలని, కాలయాపన చేయకుండా వెంటనే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో పాటు, దుర్వినియోగం కాకుండా సిమ్ కార్డును బ్లాక్ చేయాలని సూచించారు. అనంతరం సిఈఐఆర్ పోర్టల్‌లో ఫోన్ ఐఎంఈఐ నంబర్‌ను బ్లాక్ చేయాలని కోరారు. పోయిన మొబైల్ ఫోన్ల ద్వారా సైబర్ మోసాలు జరిగే అవకాశం ఉన్నందున, గుర్తుతెలియని లింకులు, అనుమానాస్పద కాల్స్ పట్ల అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు.

రికవరీ అయిన మొబైల్ ఫోన్లను పొందేందుకు బాధితులు తమ వద్ద ఉన్న సంబంధిత ధ్రువపత్రాలతో జిల్లా పోలీస్ కార్యాలయంలో ఆర్ఎస్ఐ బాలరాజు (ఫోన్: 87126 86114) ని సంప్రదించి తమ మొబైల్ ఫోన్లను పొందవచ్చని తెలిపారు.

వార్షిక తనిఖీల్లో భాగంగా రాజంపేట పోలీస్ స్టేషన్‌ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

జిల్లా ఎస్పి యం. రాజేష్ చంద్ర, ఐపీఎస్

పోలీస్ పనితీరులో నిర్లక్ష్యానికి తావులేకుండా సమర్థవంతమైన సేవలు అందించాలి







కామారెడ్డి జిల్లా ప్రతినిధి నీలగిరి వార్త: జిల్లా ఎస్పి యం.రాజేష్ చంద్ర ఐపిఎస్ కామారెడ్డి జిల్లాలో పోలీస్ శాఖ పనితీరును మరింత మెరుగుపరచడంతో పాటు, ప్రజలకు అత్యుత్తమ మరియు సమర్థవంతమైన పోలీస్ సేవలు అందించడమే ప్రధాన లక్ష్యంగా వార్షిక తనిఖీల్లో భాగంగా జిల్లా ఎస్పీ రాజంపేట పోలీస్ స్టేషన్‌ను సందర్శించి సమగ్ర తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో ముందుగా నిర్వహించిన పరేడ్ ను ఎస్పీ పరిశీలించి, సిబ్బందికి విధుల నిర్వహణకు సంబంధించి పలు కీలక సూచనలు, మార్గదర్శకాలను అందజేశారు. టెలికాన్ఫరెన్స్ ద్వారా సిబ్బందికి అందుతున్న సమాచారం, సూచనలు సక్రమంగా చేరుతున్నాయా లేదా అనే విషయాన్ని స్వయంగా అడిగి తెలుసుకున్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని పూర్తిగా వినియోగించుకుంటూ విధుల నిర్వహణలో అత్యుత్తమ సమన్వయం, అప్రమత్తతతో పనిచేయాలని ఆయన దిశానిర్దేశం చేశారు.అనంతరం పోలీస్ స్టేషన్ సిబ్బందితో సుదీర్ఘంగా మాట్లాడి, వారు నిర్వహిస్తున్న విధులు, అనుసరిస్తున్న విధానాలు, విధుల నిర్వహణలో ఎదురవుతున్న సమస్యల ను అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది సమస్యలను తెలుసుకుంటూ, విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను సమర్థవంతంగా అధిగమిస్తూ ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు.రాజంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో నేరాల తీరు, అనుమా నిత వ్యక్తులు, రౌడీషీటర్ల వివరాలు, వారి కదలికలపై సిబ్బందిని అడిగి తెలుసుకుని, నేరాల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను సమీక్షించారు. అనుమాని తులపై నిరంతరం నిఘా ఉంచాలని, అసాంఘిక కార్య కలాపాలకు పాల్పడే వారి పై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.ఈ తనిఖీలో భాగంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డ్ ల నిర్వహణ కేసు ఫైళ్లు, క్రైమ్ రికార్డులు, ఎఫ్ఐఆర్‌ల నమోదు , కేసును డైరీలు, పెండింగ్ కేసులు మరియు వివిధ రికార్డుల నిర్వహణను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. రికార్డులను ఎప్పటిక ప్పుడు నవీకరిస్తూ అత్యంత క్రమబద్ధంగా నిర్వహిం చాలని, పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేసి నిర్దిష్ట గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు చేపట్టి బాధితులకు సత్వర న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడితో మర్యాదపూర్వకంగా వ్యవహరించి, వారి సమస్యలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. గ్రామస్థాయిలో వీపీఓ విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తూ పోలీస్-ప్రజల మధ్య సత్సంబంధాలను మరింత బలోపేతం చేయాలని పేర్కొన్నారు.మహిళలు మరియు చిన్నారుల భద్రతకు అత్యుక ప్రాధాన్యత ఇస్తూ, షీ టీమ్స్ ద్వారా క్షేత్రస్థాయిలో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఎస్పీ ఆదేశించారు. సైబర్ నేరాలు, మాదకద్రవ్యాల వినియోగం, అక్రమ రవాణా మరియు ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని తెలిపారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు, రికార్డు గదులు ఎల్లప్పుడూ పరిశుభ్రంగా, సుందరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పోలీస్ శాఖలో ప్రతి ఒక్కరూ అత్యంత బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని, ప్రజల రక్షనే ధ్యేయంగా పనిచేయాలని పిలుపునిచ్చారుఈ కార్యక్రమంలో భిక్కూర్ సర్కిల్ ఇన్స్పెక్టర్ జె. నరేష్,రాజంపేట పోలీస్ స్టేషన్ యస్ఐ భువనేశ్వర్ మరియు సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ వేదికపై ఐ వి వై విద్యార్థుల పతకాల పంట!

డెహ్రాడూన్‌లో రోప్ స్కిప్పింగ్ నేషనల్ పోటీల్లో సత్తా.. 3 స్వర్ణాలు, ఒక రజతం, 2 కాంస్యాలు కైవసం

కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త
జాతీయ స్థాయిలో ఐ వి వై× (సీబీఎస్ఈ)హైస్కూల్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకున్నారు. ఉత్తరాఖండ్‌లోని డెహ్రాడూన్‌లో నిర్వహించిన ఇండియన్ రోప్ స్కిప్పింగ్ ఫెడరేషన్ (×=ాఖీ) నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీల్లో ఆరు పతకాలను సాధించి పాఠశాలకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకొచ్చారు.రోప్ స్కిప్పింగ్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచిన విద్యార్థులు మూడు స్వర్ణాలు, ఒక రజతం, రెండు కాంస్య పతకాలను సాధించారు.అండర్-17 విభాగంలో వి. సాయి తేజ స్పీడ్ స్ప్రింట్ ఈవెంట్‌లో స్వర్ణ పతకం సాధించగా, సింగిల్ డబుల్ అండర్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని కైవసం చేసుకున్నాడు. టీమ్ ఫ్రీస్టైల్ ఈవెంట్‌లో పి. క్రుతిక్ కుమార్, ఎస్. శ్రేయాన్ష్ స్వర్ణ పతకాలు సాధించి జట్టు ప్రతిభను చాటారు.రజత, కాంస్యాలతో ,అండర్-10 విభాగంలో జి. త్రిషుల్ రెడ్డి సింగిల్ డబుల్ అండర్ ఈవెంట్‌లో రజత పతకం సాధించాడు. అండర్-12 విభాగంలో శ్రేయాన్ పటేల్ స్పీడ్ స్ప్రింట్ ఈవెంట్‌లో కాంస్య పతకాన్ని అందుకున్నాడు.విద్యార్థుల విజయంపై పాఠశాల చైర్మన్ పసుల మహేష్ హర్షం వ్యక్తం చేశారు. జాతీయ స్థాయిలో విద్యార్థులు పతకాలు సాధించడం పాఠశాలకు గర్వకారణమని, వారి కృషి, పట్టుదలకు ఈ విజయం నిదర్శనమని పేర్కొన్నారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.ఈ విజయానికి విద్యార్థుల నిరంతర సాధన, క్రమశిక్షణతో పాటు పీఈటీ ఉపాధ్యాయుల కృషి ఎంతో దోహదపడిందని వారు పేర్కొన్నారు .జాతీయ వేదికపై ఐ వి వై విద్యార్థులు సాధించిన ఈ విజయంతో పాఠశాలలో ఆనందోత్సాహాలు వెల్లివిరిశాయి.

టేక్రియాల్ చెరువులో నిమజ్జన వ్యర్థాలను తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆదేశం





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
కామారెడ్డి పట్టణంలోని టేక్రియాల్ చెరువులో నిమజ్జనం అనంతరం పేరుకుపోయిన వ్యర్థాలను వెంటనే తొలగించాలని మున్సిపల్ చైర్‌పర్సన్ ఇప్ప ఉమారాణి శ్రీనివాస్ సంబంధిత మున్సిపల్ అధికారులను ఆదేశించారు. చెరువు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు, నీటి కాలుష్యాన్ని నివారించడానికి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు.ప్రజారోగ్యం, పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ నిమజ్జన వ్యర్థాలను పూర్తిస్థాయిలో తొలగించి, చెరువు పరిసరాలను శుభ్రంగా ఉంచాలని అధికారులకు స్పష్టం చేశారు.
ఈ కార్యక్రమంలో స్థానిక కౌన్సిలర్ లలిత చిట్టిబాబు, డిఈ హన్మంత్ రావు,ఏఈ వేణు ప్రసాద్,శానిటేషన్ ఇంచార్జ్ ప్రశాంత్, నాయకులు రాములు, సంజీవ్ స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

త్రోవ పై పోరాటం...?

ప్రభుత్వ అధికారుల తీరుపై .బాధితుల ఆవేదన ...?





కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త కొడిమ్యాల మండలంశ్రీరాముల పల్లె గ్రామపంచాయతీ పరిధిలో ఇంటి నెంబరు 7-111 ముందు రోడ్డుపై గోడ నిర్మించినారు. కాసిడి దేవేందర్ రెడ్డి మరియు భాగ్యమ్మ వీళ్ళిద్దరూ ప్రభుత్వ అధికారులైన ఎంపీడీవో,ఎస్సై, ఎస్పీ, కలెక్టర్, మరియు గ్రామ సెక్రెటరీ కి పలుమార్లు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఏ లాంటి చర్యలు తీసుకోలేకపోతున్నారు. ఉ మెంతుల వెంకటమ్మ మరియు భర్త ఉమెంతుల నరసింహారెడ్డి, పై పలుమార్లు అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా విచారణ చేయకుండా ఇబ్బంది పెడుతున్నారు. ఉమెంతుల వెంకటమ్మ భర్త నరసింహారెడ్డి వీళ్లకు గ్రామ పెద్దలు చెప్పిన కూడా వినటం లేదు. పలుమార్లు ప్రభుత్వ అధికారులకు ఫిర్యాదు చేసిన కూడా ఏ లాంటి చర్యలు లేవు మూడు నెలలు నుండి ఇబ్బంది పెడుతున్నారు. అని బాధితుల ఆవేదన ఇకనైనా ప్రభుత్వ అధికారులు పట్టించుకోవాలని కోరుతున్నారు.

ప్రజావాణిలో ప్రజల నుంచి 71 ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా కలెక్టర్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి నీలగిరి వార్త: కామారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ ప్రజల నుంచి 71 ఫిర్యాదులు, వినతులను స్వీకరించారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను సంబంధిత శాఖల వారీగా అధికారులకు అందజేస్తూ, ప్రతి ఫిర్యాదును క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించాలని ఆదేశించారు.అనంతరం జిల్లా అధికారులతో మాట్లాడుతూ, ప్రజావాణిలో అందిన ఫిర్యాదుల పరిష్కారంలో ఎలాంటి జాప్యం చేయకూడదని సూచించారు. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి సారించి, ఫిర్యాదుదారులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను వెంటనే పరిష్కరించాలని, పరిష్కరించిన ఫిర్యాదుల వివరాలను సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని అధికారులను ఆదేశించారు.ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణిని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కలెక్టర్ విక్టర్, డిఆర్ఓ పాండు, సీఈవో చందర్, సంబంధిత జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈనెల 15నుండి 18 వరకు నల్గొండలో జరిగే రైతు సంఘం జాతీయ మహాసభలను జయప్రదం చేయండి

కామారెడ్డి జిల్లా కేంద్రంలో కరపత్రాలను ఆవిష్కరించిన రైతు సంఘం నాయకులు



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
నవంబర్ 15 నుంచి 18 వరకు నల్గొండలో నిర్వహించనున్న అఖిల భారత కిసాన్ సభ (ఏఐకే ఎస్) జాతీయ మహాసభలను విజ యవంతం చేయాలని కోరుతూ సోమవారం జిల్లా కేంద్రంలోని ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్ లో జరిగిన రైతు సంఘం జిల్లా కమిటీ సమావేశంలో నిర్ణయించడం జరిగిందని జిల్లా కార్యదర్శి పబ్బ దశరథం, జిల్లా అధ్యక్షుడు దొడ్ల మోహన్ తెలిపారు. వ్యవసాయ రంగం ఎదుర్కొంటున్న సంక్షోభం, రైతుల సమస్యల పరిష్కారంలో ఈ మహాసభలు కీలకమని పేర్కొన్నారు.
తెలంగాణ రైతాంగ సాయుధ పోరాటానికి చారిత్రక నేపథ్యమున్న నల్గొండ గడ్డపై జాతీయ మహాసభలు నిర్వహించడం ప్రత్యేక ప్రాధాన్యత కలిగి ఉందన్నారు. నవంబర్ 15న లక్షలాది మంది రైతులతో మహా ప్రదర్శన, బహిరంగ సభ నిర్వహించనున్నట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 4000లకు పైగా ప్రతినిధులు ఈ మహాసభల్లో పాల్గొననున్న నేపథ్యంలో రైతులు, ప్రజలు పార్టీలకు అతీతంగా సహకరించి విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు భూపతి మహేందర్ రాములు సుధాకర్ రాజయ్య వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కామారెడ్డి 2 వ వార్డు కాలనీలో సమస్యలు ప్రజావాణి ఫిర్యాదుతో కలెక్టర్ ఆదేశాలు

చర్యలు చేపట్టిన మున్సిపల్ సిబ్బంది



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త: కామారెడ్డి మున్సిపల్ పరిధిలోని 2వ వార్డు డబల్ బెడ్ రూమ్ కాలనీ వాసులు తమ నివాసాలలో ఉన్న సమస్యలపై జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దీనిపై కలెక్టర్, వెంటనే మున్సిపల్ కమిషనర్ కు ఆదేశాలు జారీ చేయడంతో, మున్సిపల్ అధికారులు శానిటేషన్ కార్మికులతో జేసీబీని పంపించి, ఏపుగా పెరిగిన చెట్లు, పొదలను తొలగించారు. ఈ సందర్భంగా డబల్ బెడ్ రూమ్ అధ్యక్షులు తోకల శ్రీనివాస్, బ్రహ్మం మాట్లాడుతూ, రామేశ్వరపల్లి కాలనీలోని నివాసాలలో ఉన్న సమస్యలను జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ దృష్టికి తీసుకెళ్లగా, ఆయన వెంటనే స్పందించి మున్సిపల్ కమిషనర్ కు సూచనలు చేశారని తెలిపారు. మున్సిపల్ అధికారులు శానిటేషన్ కార్మికులతో కలిసి జేసీబీ సహాయంతో మురికి కాలువలు, డ్రైనేజీలలోని పొదలను తొలగించి, పరిశుభ్రత చేయించినందుకు జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ కు ప్రత్యేక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలియజేశారు.

రెస్టారెంట్లలో కృత్రిమ ఆహార రంగుల వినియోగం, అపరిశుభ్రత
అనుమతిలేని కృత్రిమ రంగులు వినియోగిస్తే కఠిన చర్యలు

ఆహార భద్రత అధికారి విక్రమ్





కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
కామారెడ్డి జిల్లాలో ప్రజలకు సురక్షితమైన, నాణ్యమైన ఆహార పదార్థాలు అందించాలనే లక్ష్యంతో ఆహార భద్రతా శాఖ ఆధ్వర్యంలో సోమవారం రెస్టారెంట్లు, ఆహార విక్రయ కేంద్రాల్లో తనిఖీలు నిర్వహించారు.
ఈ తనిఖీల్లో భాగంగా కామారెడ్డి పట్టణంలోని అల్ సుభాన్ రెస్టారెంట్‌ను ఆహార భద్రత అధికారి విక్రమ్ తనిఖీ చేశారు. తనిఖీల సందర్భంగా చికెన్ కూరలు, వేయించిన అన్నం తదితర వంటకాల తయారీలో అనుమతిలేని కృత్రిమ ఆహార రంగులు వినియోగిస్తున్నట్లు గుర్తించారు. అంతేకాకుండా వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం, వంట సిబ్బంది తల కవర్లు, చేతి తొడుగులు, ఏప్రాన్లు ధరించకపోవడం వంటి లోపాలను గుర్తించారు.ఈ సందర్భంగా మానవ వినియోగానికి పనికిరాని సుమారు 15 కిలోల నిల్వ ఆహార పదార్థాలను అక్కడికక్కడే ధ్వంసం చేశారు. అనుమానిత ఆహార నమూనాలను సేకరించి పరీక్షల నిమిత్తం ప్రయోగశాలకు పంపించారు. సంబంధిత ఆహార వ్యాపార సంస్థకు ఆహార భద్రత మరియు ప్రమాణాల చట్టం, 2006లోని సెక్షన్ 32 ప్రకారం నోటీసు జారీ చేశారు.అదేవిధంగా కామారెడ్డి పట్టణంలోని ఎస్ఎస్ఎస్ టిఫిన్ సెంటర్‌ను కూడా తనిఖీ చేశారు. వంటశాల అపరిశుభ్రంగా ఉండటం, వ్యర్థాల నిర్వహణ సక్రమంగా లేకపోవడం వంటి పరిశుభ్రతా లోపాలను గుర్తించారు. సంబంధిత సంస్థకు మెరుగుదల నోటీసు జారీ చేసి, అనుమానిత ఆహార నమూనాలను సేకరించి ప్రయోగశాలకు పంపించారు. ప్రయోగశాల నివేదిక ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఈ సందర్భంగా ఆహార భద్రత అధికారి విక్రమ్ మాట్లాడుతూ, హోటళ్లు, రెస్టారెంట్ల నిర్వాహకులు ఆహార భద్రతా ప్రమాణాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. వంటశాలలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు ఆహార తయారీలో నాణ్యమైన ముడి పదార్థాలను మాత్రమే వినియోగించాలని, సిబ్బంది వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని తెలిపారు. ఆహార పదార్థాల్లో నిబంధనలకు విరుద్ధంగా కృత్రిమ రంగులు కలపడం నిషేధమని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
ప్రజలకు విజ్ఞప్తి:
ప్రజలు హోటళ్లు, రెస్టారెంట్లలో ఆహార పదార్థాలను కొనుగోలు చేసేటప్పుడు అప్రమత్తం గా ఉండాలని, అధికంగా కృత్రిమ రంగులు కలిపిన ఆకర్షణీయమైన ఆహార పదార్థాలను తీసుకోవద్దని సూచించారు. ఆహార నాణ్యత, పరిశుభ్రత విషయంలో అనుమానాలు ఉన్నట్లయితే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.

తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా కామారెడ్డికి చెందిన డా.ఎం. జైపాల్ రెడ్డి నియామకం



కామారెడ్డి జిల్లా ప్రతినిధి: నీలగిరి వార్త:
తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్, స్థానిక ఆర్మీ గ్రూప్ సీఈఓ, ప్రముఖ విద్యావేత్త, కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ప్రెసిడెంట్ ఈ కామారెడ్డి ఒలింపిక్ డే రన్ చైర్మన్ డా.ఎం. జైపాల్ రెడ్డిని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ అడ్వైజరీ కమిటీ మెంబర్‌గా నియమించింది. క్రీడారంగంలో ఆయన అందిస్తున్న సేవలను గుర్తిస్తూ ఒలింపిక్ అసోసియేషన్ ఈ బాధ్యతలను అప్పగించింది. ఈ నియామకాన్ని తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ పి. మల్లారెడ్డి అధికారికంగా నిర్ధారించారు.
తెలంగాణ ఒలింపిక్ అసోసియేషన్ ప్రెసిడెంట్, మాజీ ఎంపీ జితేందర్ రెడ్డి చైర్మన్‌గా, మాజీ మంత్రి వేణుగోపాల్ చారి వైస్ చైర్మన్‌గా, మరియు డిప్యూటీ చైర్మన్ తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ బండ ప్రకాష్ కన్వీనర్‌గా వ్యవహరిస్తున్న ఈ అడ్వైజరీ కమిటీలో కామారెడ్డి జిల్లా నుండి జైపాల్ రెడ్డి ఎంపిక కావడంపై స్థానికంగా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. విద్యావంతుడైన జైపాల్ రెడ్డి నిరంతరం విద్యార్థులను, యువతను అథ్లెటిక్స్ వైపు, క్రీడల వైపు ప్రోత్సహిస్తూ, అందరినీ చైతన్యపరుస్తూ ముందుకు తీసుకెళ్తున్నందుకే తనకు ఈ గొప్ప అవకాశం దక్కిందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. జైపాల్ రెడ్డి నియామకం పట్ల కామారెడ్డి జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ సభ్యులు, వివిధ క్రీడ సంఘాలు, వివిధ కళాశాలల అధ్యాపక బృందం, విద్యార్థులు, స్థానిక అథ్లెట్లు, క్రీడాకారులు మరియు క్రీడాభిమానులు హర్షం వ్యక్తం చేస్తూ ఆయనకు ఘనంగా అభినందనలు తెలియజేశారు.
క్రీడాకారులకు ప్రోత్సాహం అందిస్తాం -- జైపాల్ రెడ్డి:
ఈ సందర్భంగా జైపాల్ రెడ్డి మాట్లాడుతూ... తనకు ఇంతటి బాధ్యత ను అప్పగించినందుకు స్టేట్ ఒలింపిక్ కమిటీకి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రాబోయే రోజుల్లో కామారెడ్డి జిల్లా క్రీడాకారులకు రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో సముచిత స్థానం దక్కేలా, అన్ని రకాల క్రీడల్లో మన జిల్లా క్రీడాకారులు ప్రాతినిధ్యం వహించేలా కృషి చేస్తానని తెలిపారు. తద్వారా తెలంగాణ రాష్ట్రానికి క్రీడా రంగంలో మంచి పేరు తీసుకువస్తామని ఆశాభావం వ్యక్తం చేశారు.
రాష్ట్ర ప్రభుత్వం ప్రస్తుతం క్రీడలకు ఎంతో ప్రాధాన్యత ఇస్తోందని, కాబట్టి యువత, విద్యార్థులు చెడు అలవాట్లకు బానిసలు కాకుండా చదువుతో పాటు ఆటలను కూడా సమానంగా బ్యాలెన్స్ చేయాలని పిలుపునిచ్చారు. క్రీడల వల్ల శారీరక దృఢత్వం, ఆరోగ్యం, మానసిక ఉల్లాసం లభిస్తాయని, జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవడానికి ఇవి ఎంతగానో దోహదపడతాయని తెలిపారు. ప్రతిభ గల క్రీడాకారులకు, విద్యార్థులకు ఎల్లప్పుడూ తన వంతు సంపూర్ణ ప్రోత్సాహం ఉంటుందని జైపాల్ రెడ్డి స్పష్టం చేశారు.

ఇతర రాష్ట్రాల సర్టిఫికెట్లతో ఉద్యోగాలు...?

ప్రభుత్వ నర్సింగ్ కళాశాలో అసిస్టెంట్ లైబ్రేరియన్ పోస్టుకు వేరే రాష్ట్రాలకు చెందిన సర్టిఫికెట్ను పెట్టి ఉద్యోగం

ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి బ్రాహ్మణ పెల్లి యుగేందర్



కరీంనగర్ ప్రతినిధి నీలగిరి వార్త ఇతర రాష్ట్రాల సర్టిఫికెట్స్ పెట్టి ఉద్యోగం పొందిన వారిపై వెం టనే చర్యలు తీసుకోవాలని కోరుతూ ఏఐవైఎఫ్ జిల్లా సమితి ఆధ్వర్యంలో కరీంనగర్ కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించడం జరిగింది. సందర్భ ంగా బ్రాహ్మణపల్లి యుగంధర్ మాట్లాడుతూ హైకోర్టు ఇచ్చిన జీవోకు వ్యతిరేకంగా ఉద్యోగం నియామకం చేపట్టిన వారిపై విచారణ చేసి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య మరియు ఆరోగ్యశాఖ ఆధ్వర్యములో నూతనంగా ఏర్పడిన ప్రభుత్వ నర్సింగ్ కళాశాల నందు విధులు నిర్వహించుటకై ఉద్యోగ ప్రకటన వెలువడిందని అట్టి విషయం గురించి అసిస్టెంట్ లైబ్రేరియన్ జనరల్ ఓ.సి(1) ఒక పోస్టు గురించి ఇచ్చిన అర్హతల దరఖాస్తులలో కొన్ని అవకతవకలు ఉన్నాయని పేర్కొన్నారుకలెక్టర్ఇచ్చిన విద్యార్హత అసిస్టెంట్ లైబ్రేరియన్కు అభ్యర్థి గుర్తింపు పొందిన యునివర్సిటీ నుండి బ్యాచ్లర్ అఫ్ లైబ్రేరి మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ (బి.ఎల్.ఐ.సి) ఉత్తీర్ణుత పొంది ఉండాలి అభ్యర్థి మెడికల్ డిపార్టుమెంట్ నందు కనీసం రెండు సంవత్సరాలు అసిస్టెంట్ లైబ్రేరియన్ గా పని చేసి ఉండాలని ఉద్యోగ ప్రకటనలో కోరారు. యు.జి.సి -2013 పబ్లిక్ నోటీస్ ద్వారా జారీ చేసిన ఉత్తర్వుల గైడ్లెన్స్లో అక్కడి యునివర్శిటీలలో ఆ పరిధిలోనే జుడిషన్లో బ్యాచ్లర్ అఫ్ లైబ్రేరి మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్ (బి.ఎల్.ఐ.సి) నందు ఉత్తీర్ణుత పొందియుండవలెను.జుడిషన్లో బ్యాచ్లర్ అఫ్ లైబ్రేరి మరియు ఇన్ఫరమేషన్ సైన్స్ (బి.ఎల్.ఐ.సి) నందు పరిధి దాటి చదివిన వారిని పరిగణలోకి తీసుకోరాదు. మీరు ఇచ్చిన పత్రికా ప్రకటన నోటిఫికేషన్లో వచ్చిన అప్లికేషన్లో చాలా ద్రావిడ యునివర్సిటీ, ఆచార్య నాగార్జున యునివర్సిటీ, వెంకటేశ్వర యునివర్సిటీ, కుప్పం యునివర్సిటీ వాళ్లు ఉన్నారు కాబట్టి వారిని పరిగణలోకి తీసుకోరాదు. వారి పరిధిలో చదవకుండా బయట అనగా తెలంగా ణలో ఎక్కడో చదివిన పట్టా డిగ్రీ పొందుతున్నారు. తెలంగాణ యునివర్శీటీలలో ఉన్న బ్యాచ్లర్ ఆఫ్ లైబ్రేరి మరియు ఇన్ఫర్మేషన్ సైన్స్(బి.ఎల్.ఐ.సి) కోర్సు ఎక్కడ ఉన్నదంటే, ఓ.యు. అంబేద్కర్ డిస్టెన్స్, కె.యు డిస్టెన్స్ వీటిలో లైబ్రేరి సైన్స్ ఉ న్నందున ఈ యునివర్సిటీలో చదివిన వారినే అసిస్టెంట్ లైబ్రేరియన్గా ఉద్యోగ నియామకం చేయవలేను మరియు ఇట్టి ఉద్యోగ నియామకం కొరకు ఎవరు అర్హులో పరిశీలించి నియమించుకోవాలి.ఇచ్చిన ఉద్యోగ ప్రకటనలో అసిస్టెంట్ లైబ్రేరియన్ కు అనుభవం ఎక్కువ ఉన్నవారిని, రెగ్యూలర్ గా చదువుకున్న వారిని అర్హులుగా ముందుస్థానంలో తీసుకోవాలి.తరువాత డిస్టెన్స్ వారిని తీసుకోగలరని ఆయన కోరారు.ఈ ధర్నా కార్యక్రమంలో జిల్లా సహాయ కార్యదర్శిఉదయ భాస్కర్, నగర సహాయ కార్యదర్శి జువ్వాజి తిరుపతి, నాయకులు రమేష్,రవీందర్,,అవినాష్ అఖిల్, నరేందర్,ఉమేష్, చందు,,వినయ్ తదితరులు పాల్గొన్నారు.

2027 వరంగల్ జిల్లా V101A గవర్నర్ గా గుమ్మడి వెల్లి సత్యనారాయణ రావు.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. వాసవి క్లబ్స్ ఇంటర్నేషనల్ వరంగల్ జిల్లా ణఅంఎశీఅ గవర్నర్ మంచాల విజయ్ కుమార్ అధ్యక్షతన నిన్నటి రోజు గోల్డెన్ గార్డెన్ హంటర్ రోడ్ లో జరిగింది,, ముఖ్య అతిధి గా ఇంటర్నేషనల్ పాస్ట్ ప్రెసిడెంట్ వాసవియన్ ఇరుకుల్ల రామకృష్ణ , అబ్జర్వర్ వి.యం .గంప శ్రీనివాస్ సమక్షంలో సత్యనారాయణ రావు ప్రమాణ స్వీకారం చేసారు, జిల్లాను అభివృద్ధిలో వుంచుతు ఇంటర్నేషనల్ లో ఉత్తమ జిల్లా గా పేరు తెస్తానని హామీ ఇచ్చారు. ఐ. ఈ. సి ఆఫీసర్ లు, జిల్లా అధికారులు, సభ్యులు ఘనంగా సత్కరించారు

నవంబర్ 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026.

వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. నవంబర్ 5వ తెలంగాణ పోలీస్ గేమ్స్ అండ్ స్పోర్ట్స్ మీట్--2026(క్లస్టర్ -డి) వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో, ఈ నెల 3 నుంచి 5వ తేదీ వరకు, హనుమకొండలోని జేఎన్ఎస్ స్టేడియం, కిట్స్ కళాశాల, భీమారం ఎస్వీఎస్ కళాశాలల్లో నిర్వహించబడుతున్నదని, వరంగల్ పోలీస్ కమిషనర్ ఎన్.శ్వేత ఐపీఎస్ తెలిపారు.ఈ క్రీడా పోటీల్లో తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 1535 మంది పోలీసు క్రీడాకారులు పాల్గొననున్నారు.

యువజన పార్లమెంట్‌లో ప్రతిభ కనబరిచిన విష్ణ్ణేష్!



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. హనుమకొండలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ కళాశాలకు చెందిన బీఏ విద్యార్థి విష్ణ్ణేష్ మై భారత్ -- వరంగల్ ఆధ్వర్యంలో వాగ్దేవి కళాశాలలో అక్టోబర్ 31 న నిర్వహించిన జిల్లా స్థాయి యువజన పార్లమెంట్ కార్యక్రమంలో ప్రతిభ కనబరిచారు. యువజన పార్లమెంట్‌లో ప్రజాస్వామ్య అంశాలపై తన అవగాహనను ప్రదర్శించి ప్రత్యేక గుర్తింపు పొందారు.ఈ సందర్భంగా సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఎస్. జ్యోతి విష్ణ్ణేష్‌ను అభినందించి ప్రశంసాపత్రాన్ని అందజేశారు. విద్యార్థులు విద్యతో పాటు సామాజిక, ప్రజాస్వామ్య అంశాలపై అవగాహన పెంపొందించుకోవాలని ఆమె సూచించారు.ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ డా. ఎస్.ఎం. రెహమాన్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారులు డా. ఎస్. శ్రీదేవి, డా. ఎన్. చందర్, ఎ. శ్రీలత తదితరులు పాల్గొన్నారు.

శంభునిపేట, కరీమాబాద్ తదితర ప్రాంతాలకు సిటీ బస్సు సౌకర్యం కల్పించాలి

- ఆర్టీసీ రీజినల్ మేనేజర్‌కు స్వచ్ఛంద సంస్థల వినతి.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
వరంగల్ నగరంలోని శంభునిపేట, కరీమాబాద్, ఎస్ ఆర్ ఆర్ తోట, బట్టల బజార్ మరియు మట్టేవాడ ప్రాంతాల మీదుగా నూతన సిటీ బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతూ సోమవారం టీజీఎస్ఆర్టీసీ (ఓ+ూ=ొజ) వరంగల్ రీజినల్ మేనేజర్ గారికి పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు వినతి పత్రం సమర్పించారు.
ఈ ప్రాంతాలలో వేలాది కుటుంబాలు నివసిస్తున్నాయని, సరైన సిటీ బస్సు సౌకర్యం లేకపోవడం వల్ల విద్యార్థులు, కార్మికులు, మహిళలు చిరు వ్యాపారులు ప్రైవేటు ఆటోలను ఆశ్రయించి తీవ్ర ఆర్థిక భారాన్ని ఎదుర్కొంటున్నారని వారు ఈ వినతి పత్రంలో పేర్కొన్నారు. ప్రజల రద్దీని మరియు అవసరాలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే ఈ కొత్త బస్సు రూట్‌ను ప్రారంభించాలని వారు కోరారు.
ఆర్ఎం కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో సమాచార హక్కు చైతన్య సమితి (ూఒజూ) వ్యవస్థాపక అధ్యక్షులు సాదుల పూర్ణచందర్, వెంకటేశ్వర ఫౌండేషన్ అధ్యక్షులు బి. రాజు (బొల్లం రాజు), మరియు వరంగల్ నగర్ టౌన్ వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి కొండె రాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ ప్రజా ఉద్యమంగా మారాలి!

- మిషన్ లైఫ్ తో పర్యావరణ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలి

- డిఈ రాజేందర్ గంధం.





వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. బ్రిక్స్ పర్యావరణ మంత్రుల సమావేశంలో ఆమోదించిన సంయుక్త మంత్రుల ప్రకటనకు అనుగుణంగా నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న బ్రిక్స్ సస్టేనబుల్ లైఫ్ స్టైల్ వీక్ సందర్భంగా మిషన్ లైఫ్ లక్ష్యాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టాలని టీజీ రెడ్కో డీఈ రాజేందర్ గంధం పిలుపునిచ్చారు. ముఖ్యంగా విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణకు ప్రాధాన్యతనిస్తూ పర్యావరణహిత జీవనశైలిని అలవర్చుకోవాలని ఆయన సూచించారు. సోమవారం వరంగల్ లో రాజేందర్ మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ అనేది కేవలం ప్రభుత్వ బాధ్యత మాత్రమే కాదని, ప్రతి పౌరుడి సామాజిక బాధ్యత అని అన్నారు. మన దైనందిన జీవితంలో పాటించే చిన్న చిన్న పొదుపు అలవాట్లు సైతం పర్యావరణ పరిరక్షణలో గొప్ప మార్పులకు నాంది పలుకుతాయని తెలిపారు.ప్రజలు తమ రోజువారీ జీవితంలో కొన్ని ముఖ్యమైన అంశాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు.
విద్యుత్ పొదుపు :
అవసరం లేనప్పుడు లైట్లు, ఫ్యాన్లు, ఇతర విద్యుత్ పరికరాలను ఆపివేయడం ద్వారా విద్యుత్ వృథాను అరికట్టాలి.సౌరశక్తి వినియోగం: సంప్రదాయ ఇంధన వనరులపై ఆధారపడటాన్ని తగ్గించి, సౌరశక్తి వంటి పునరుత్పాదక ఇంధన వనరుల వినియోగాన్ని విస్తృతంగా ప్రోత్సహించాలి.
నీటి సంరక్షణ:
నీటిని వృథా చేయకుండా, ప్రతి నీటి బొట్టును విలువైన వనరుగా భావించి పొదుపుగా వినియోగించాలి. పర్యావరణహిత జీవనశైలి: ప్రకృతి వనరులను పరిరక్షిస్తూ, పర్యావరణానికి హాని కలిగించని జీవన విధానాలను అలవర్చు కోవాలి. ప్రజల్లో అవగాహన: కుటుంబ సభ్యులు, విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలకు విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ ఆవశ్యకతపై అవగాహన కల్పించాలి.మిషన్ లైఫ్ అనేది కేవలం నవంబర్ 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహించే వారోత్సవానికి మాత్రమే పరిమితం కాకుండా, ప్రతి ఒక్కరి నిత్యజీవితంలో ఒక భాగంగా మారాలని ఆయన ఆకాంక్షించారు. ప్రతి ఇంటి నుంచే పర్యావరణ పరిరక్షణకు శ్రీకారం చుట్టాలని, వ్యక్తిగత బాధ్యతతో సమాజంలో సానుకూల మార్పు తీసుకురావాలని రాజేందర్ పిలుపునిచ్చారు. ప్రభుత్వ శాఖలు, విద్యాసంస్థలు, యువజన సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, ప్రభుత్వ ఉద్యోగులు, ప్రజలందరూ మిషన్ లైఫ్ కార్యక్రమంలో భాగస్వాములై విద్యుత్ పొదుపు, నీటి సంరక్షణ, పర్యావరణ పరిరక్షణ అంశాలను ప్రజా ఉద్యమంగా ముందుకు తీసుకెళ్లాలని రాజేందర్ గంధం విజ్ఞప్తి చేశారు.
విద్యుత్‌ను ఆదా చేద్దాం!...నీటిని సంరక్షిద్దాం!!... పర్యావరణాన్ని పరిరక్షిద్దాం!!! సుస్థిర భవిష్యత్తు కోసం ప్రతి ఒక్కరం బాధ్యతగా ముందడుగు వేద్దాం!!!!

కరీమాబాద్ ఉర్సు గుట్ట లో నవంబర్ 6న జరిగే నరకాసుర వధకు.

వరంగల్ బల్దియా కమిషనర్ టి.వెంకన్నకు ఆహ్వాన పత్రం అందించిన.

నరకాసుర వద నిర్వహణ కమిటీ సభ్యులు.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.
భారతీయులు జరుపుకునే ముఖ్య పండుగ అయిన దీపావళి పండుగ సందర్భంగా నవంబర్ ఆరో తారీఖున జరుగు ఉత్సవములు జయప్రదం కావడానికి తమరు విచ్చేయవలసిన దిగా వరంగల్ మహా నగర పాలక సంస్థ కమిషనర్ వెంకన్న కు నరకాసుర వధ ఉత్సవ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి ఆధ్వర్యంలో ఆహ్వాన పత్రికను ఇచ్చినారు ఉర్సు గుట్ట కూడా మైదానంలో 58 ఫీట్ల ఎత్తుగల నరకాసురుని ప్రతిమకు పెద్ద ఎత్తునబాంబులు అమర్చి పేల్చి వేస్తామని సాయంత్రం 6:00 నుండి సాంస్కృతిక కార్యక్రమాలు జరుగుతుంటాయని 9 గంటలకు మంది ప్రజలు పాల్గొంటారని కమిషనర్ వెంకన్నకు నరకాసుర వధ ఉత్సాహ కమిటీ అధ్యక్షులు మరుపల్ల రవి వివరించినారు అలాగే వరంగల్ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మీసాల ప్రకాష్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గోపాల నవీన్ రాజ్ లకు ఆహ్వాన పత్రికను అందజేసినారు అందజేసిన వారిలో ప్రతినిధులు మరుపల్ల గౌతమ్, ఆవు నూరి రామ్మూర్తి, దూడే బాల కొమురెల్లి ,వనం కుమార్, శెట్టి మోహన్, తవటం నరసింహ, కుండె రాజు, ఆవునూరీ ఐలేశం, పొలం రంజిత్, కుండే సదానందం, గౌడ కోటేశ్వర్ ,బలబద్ర శివకృష్ణ లు ఉన్నారు.

గ్రీవెన్స్ ఫిర్యాదులను వెంటనే పరిష్కరించండి

బల్దియా కమిషనర్ వెంకన్న.

ప్రజావాణిలో 116 దరఖాస్తుల స్వీకరణ.

సమస్యల పరిష్కారం లో జవాబుదారీ తనం అవసరమన్న కమిషనర్....



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త. సోమవారం బల్దియా ప్రధాన కార్యాలయం లోని కౌన్సిల్ హాల్ లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుంచి ఫిర్యాదుల సంబంధ దరఖాస్తులను స్వీకరించి ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించి, సమస్య స్వభావానికి అనుగుణంగా ఆయా విభాగాలకు బదలాయించారు. గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంలో నిర్లక్ష్యాన్ని, జాప్యాన్ని సహించేది లేదని అధికారులకు సూచించారు. నిర్దేశిత గడువులోగా సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు.గత వారం ప్రజావాణిలో స్వీకరించిన వినతుల పరిష్కార స్థితిగతులను కమిషనర్ విభాగాల వారీగా సమీక్షించారు. పెండింగ్‌లో ఉన్న అంశాలను తక్షణమే పరిష్కరించడంతో పాటు, తీసుకున్న చర్యలను సంబంధిత ఫిర్యాదుదారులకు తెలియజే యాలని, ప్రజా సమస్యల పరిష్కారంలో అనవసర జాప్యం జరిగితే సంబం ధిత అధికారులే పూర్తి బాధ్యత వహించాల్సి ఉంటుందని,ప్రజలకు అందించే ప్రతి పౌర సేవలో పారదర్శకత, జవాబుదారీతనం, వేగం ఉండాలని కమిషనర్ పేర్కొన్నారు.
ప్రజావాణిలో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు:
టౌన్ ప్లానింగ్ -- 51 , ఇంజినీరింగ్ -- 46 ఆరోగ్యం,
పారిశుద్ధ్యం -- 11 రెవెన్యూ -- 06,
హార్టికల్చర్ -- 01, నీటి సరఫరా...01

మొత్తం 116 దరఖాస్తులు.
ఈ కార్యక్రమంలో ఇంచార్జి అదనపు కమిషనర్ సమ్మయ్య, సూపరింటెండింగ్ ఇంజినీర్ రాజ్‌కుమార్, సిటీ ప్లానర్ రవీందర్ రాడేకర్,ముఖ్య హార్టికల్చర్ అధికారి లక్ష్మారెడ్డి, డిప్యూటీ కమిషనర్ ప్రసన్నరాణి, సెక్రటరీ అనిల్‌బాబు, పన్నుల అధికారి రామకృష్ణ అన్ని విభాగాల అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

అమిత్ షాకు ఘన స్వాగతం పలికిన బీజేపీ నేతలు

భాగ్యలక్ష్మి అమ్మవారికి ప్రత్యేక పూజలు జరిపిన అమిత్ షా



హైద్రాబాద్ నీలగిరి వార్త నవంబర్ 2:నగర పర్యటనలో భాగంగా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా సోమవా రం ఉదయం బేగంపేట విమానాశ్రయానికి చేరుకున్నా రు. కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు కేంద్ర కిషన్ రెడ్డి ,బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామచంద్ర రావు,తదితరులు ఘన స్వాగతం పలికారు. విమానాశ్రయం వద్ద ఆయనకు శాలువా కప్పి, పూలబోకే అందించి ఆత్మీయంగా సత్కరించారు.అనంతరం అక్కడి నుండి చార్మినార్ సమీపంలోని భాగ్యలక్ష్మి అమ్మవారి గుడికి చేరుకున్నారు. అక్కడ అమిత్ షా అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆలయ పూజారులు వారికి వేద ఆశీర్వచనాలతో తీర్థప్రసాదాలు అందజేశారు.

దివ్యాంగుల మధ్య బేతి మనోజ్ఞ జన్మదిన వేడుకలు

అన్నదానం, పండ్ల పంపిణీ.



వరంగల్ బ్యూరో నీలగిరి వార్త.

కాశిబుగ్గలోని మదర్ తెరిసా ఫౌండేషన్‌లో బేతి మనోజ్ఞ జన్మదినోత్సవం సందర్భంగా ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా దివ్యాంగుల మధ్య కేక్ కట్ చేసి, పండ్ల పంపిణీ చేయడంతో పాటు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ వరంగల్ జిల్లా చైర్మన్ బేతి అశోక్ బాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా అశోక్ బాబు మాట్లాడుతూ, పుట్టినరోజు వేడుకలను కేవలం కుటుంబ సభ్యుల మధ్య జరుపుకోవడమే కాకుండా, దివ్యాంగుల మధ్య జరుపుకుంటూ వారికి అన్నదానం చేయడం ఎంతో సంతోషకరమైన విషయమని అన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజంలో మానవత్వం, సేవాభావం, సాటి మనిషి పట్ల ప్రేమను పెంపొందిస్తాయని తెలిపారు. సేవే మానవత్వానికి ప్రతిరూపం -- పుట్టినరోజు వేడుకల్లో సేవా స్ఫూర్తిని చాటిన బేతి మనోజ్ఞ ఈ కార్యక్రమంలో బేతి వీరలక్ష్మి బేతి రాజు బేతి శ్వేత బేతి శోభారాణి బేతి దివ్య బేతి సాయి బేతి నాని చారీ మదర్ తెరిసా ఫౌండేషన్ వారు తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో మృతి

-యాదాద్రి భువనగిరి జిల్లా సంస్థాన్ నారాయణపురం మండలం వెలమకన్నే గ్రామంలో శేఖర్ భౌతికయానికి నివాళులర్పించిన టియుడబ్ల్యూజే, ఐజేయు నేతలు



ఎల్బీనగర్ నీలగిరి వార్త (నవంబర్ 2): ప్రజాశక్తి, సూర్య దినపత్రికల్లో ఎల్బీనగర్ నియోజకవర్గం మన్సూరాబాద్ లో జర్నలిస్టుగా పనిచేసినటువంటి భీమనపల్లి శేఖర్ గుండెపోటుతో ఆదివారం రాత్రి ఆకస్మిక మృతి. శేఖర్ మృతి చెందిన విషయం తెలుసుకున్న టీయూడబ్ల్యూజే (ఐజేయు) రంగారెడ్డి జిల్లా మాజీ అధ్యక్షులు, తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కొంపల్లి శ్రీకాంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సత్యనారాయణ, తెలంగాణ రాష్ట్ర నాయకులు, సీనియర్ జర్నలిస్ట్ జే కిషన్(రాధా కిషన్), జిల్లా సంయుక్త కార్యదర్శి గొల్లంపల్లి ఆంజనేయులు, ట్రెజరర్ శశిపాల్ రెడ్డి , సీనియర్ జర్నలిస్టులు బాణాల మధుసూదనాచారి, చాపల శ్రీనివాస్, నర్రి రమేష్, దేవయ్య తదితరులు శేఖర్ భౌతిక్యంపై పూల మాలలు వేసి నివాళులు అర్పించడం జరిగింది. అనంతరం కుటుంబ సభ్యులను ఓదార్చారు. భవిష్యత్తులో శేఖర్ కుటుంబానికి అండగా ఉంటామని ఐజేయు నేతలు భరోసా కల్పించారు.

సభాపతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు..!!

అభివృద్ధి కార్యక్రమాలపై వివరణ.. పట్టభద్రుల ఎన్నికల్లో కాంగ్రెస్ విజయానికి కృషి

నీలగిరి వార్త వికారాబాద్ జిల్లా ప్రతినిధి, వికారాబాద్ జిల్లా నవాబుపేట మండలంలోని వట్టి మినపల్లి గ్రామంలో సోమవారం నిర్వహించిన అదితి గోశాల ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరైన తెలంగాణ శాసనసభా పతి గడ్డం ప్రసాద్ కుమార్‌ను నవాబుపేట మండల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మండలంలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజలకు అందుతున్న సంక్షేమ ఫలాల గురించి ఆయనకు వివరించారు. అదేవిధంగా రాబోయే పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి మెరుగైన ఫలితాలు సాధించేలా మండలంలో విస్తృతంగా కృషి చేస్తున్నామని నాయకులు తెలిపారు. పార్టీ అభ్యర్థి విజయానికి కార్యకర్తలు, నాయకులు సమన్వయంతో పనిచేస్తూ పట్టభద్రుల ఓటర్లను చైతన్యపరుస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి,సర్పంచ్ ల సంఘం అధ్యక్షులు కొండల్ యాదవ్,జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, సర్పంచులు నరసింహారెడ్డి, దాన నర్సింలు, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, నాయకులు ప్రభాకర్ రెడ్డి, అనంత రాములు తదితరులు పాల్గొన్నారు.

వరంగల్ జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలి!.

రైతాంగాన్ని ప్రభుత్వం తక్షణమే ఆదుకోవాలి!

రైతులకు సాగునీరు వ్యవసాయానికి 24 గంటల నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలి!.

సిపిఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా.



వరంగల్ జిల్లా కేంద్రంలోని శివనగర్ తమ్మెర భవన్‌లో ఈరోజు జరిగిన భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ముఖ్య కార్యకర్తల సమావేశానికి సంఘీ ఏలేంధర్ అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా పాల్గొన్న సీపీఐ వరంగల్ జిల్లా కార్యదర్శి షేక్ బాష్ మియా మాట్లాడుతూ

వరంగల్ జిల్లాలో ఈ సంవత్సరం వర్షాభావ పరిస్థితుల కారణంగా రైతాంగం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నదని, సరైన సమయానికి వర్షాలు కురవకపోవడంతో పంటలు ఎండిపోయి రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వ్యవసాయంపై ఆధారపడిన రైతులు పెట్టుబడులు పెట్టి పంటలు సాగు చేసినప్పటికీ ఆశించిన స్థాయిలో దిగుబడులు వచ్చే పరిస్థితి లేదన్నారు. రైతులకు పెట్టుబడి భారం పెరిగి అప్పుల ఊబిలో కూరుకుపోతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వరంగల్ జిల్లాలోని అన్ని మండలాలను కరువు ప్రభావిత ప్రాంతాలుగా గుర్తించి కరువు ప్రాంతంగా ప్రకటించాలని డిమాండ్ చేశారు. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు తగిన నష్టపరిహారం అందించాలని పంటల బీమా పరిహారం చెల్లించాలని రైతుల రుణాలను మాఫీ చేయాలని కోరారు. సాగునీటి వనరులను అభివృద్ధి చేసి చెరువులు కుంటల్లో నీటిని నింపడంతో పాటు రైతులకు సాగునీరు అందించాలని వ్యవసాయానికి నిరంతర నాణ్యమైన విద్యుత్ సరఫరా చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతాంగ సమస్యల ను క్షేత్రస్థాయిలో తెలుసుకునేందుకు నవంబర్ 3, 2026న వరంగల్ జిల్లాలోని వివిధ మండలాల్లో సీపీఐ నాయకులు కార్యకర్తలు పర్యటించి రైతులతో నేరుగా మాట్లాడి పంటల పరిస్థితి సాగునీరు విద్యుత్ సమస్యలు పంట నష్టాల వివరాలను సేకరిస్తారని తెలిపారు. ఈ పర్యటనలో సేకరించిన వివరాలతో సమగ్ర నివేదికను రూపొందించి ప్రభుత్వానికి అందజేస్తామని చెప్పారు. అయినప్పటికీ ప్రభుత్వం స్పందించకపోతే రైతాంగ సమస్యల పరిష్కారం కోసం పెద్ద ఎత్తున ఉద్యమాలు చేపడతామని హెచ్చరించారు. వరంగల్ జిల్లా కలెక్టర్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించి రైతాంగ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి సీపీఐ జిల్లా నాయకులు మండల కార్యదర్శులు ప్రజాసంఘాల నాయకులు పార్టీ కార్యకర్తలు రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిపిఐ వరంగల్ జిల్లా సహాయ కార్యదర్శులు పనాస ప్రసాద్ దండు లక్ష్మన్ జిల్లా కార్యవర్గ సభ్యులు గుండె బద్రి జిల్లా సమితి ల్యాదల్ల శరత్ యండి యాకుబ్ వెంకటాద్రి తదితరులు పాల్గొన్నారు.

వట్టిమినపల్లిలో అదితి గోక్షేత్రం ప్రారంభోత్సవం..!!

గోవర్ధన గిరి గుట్టపై దేవతామూర్తుల ప్రతిష్ఠ మహోత్సవాలకు శ్రీకారం..!!

హిందూ ధర్మ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత..! స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్.

వికారాబాద్ జిల్లా ప్రతినిధి నవాబు పెట్ మండలం






వికారాబాద్ జిల్లా నవాబుపేట్ మండలం వట్టిమినపల్లి గ్రామంలోని గోవర్ధన గిరి గుట్టపై శ్రీ అదితి గోక్షేత్రం ప్రారంభోత్సవం, దేవతామూర్తుల దివ్య ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవాలు భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. అవధూత దత్త పీఠాధిపతి శ్రీశ్రీశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ ఈ కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. స్వామీజీ రాకతో గోవర్ధన గిరి గుట్ట ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. గోక్షేత్రం ప్రారంభోత్సవంతో పాటు శ్రీ దత్తాత్రేయ స్వామి, ఆంజనేయ స్వామి తదితర దేవతామూర్తుల విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాలు వేద మంత్రోచ్ఛారణలు, ప్రత్యేక పూజల మధ్య ప్రారంభమయ్యాయి. స్వామీజీ ఆశీస్సులు పొందేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలివ చ్చారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందూ ధర్మ పరిరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అన్నారు. గోశాలల నిర్వహణ, గోవుల సంరక్షణ వంటి కార్యక్రమాలు ధర్మ పరిరక్షణలో కీలకమని పేర్కొన్నారు. హిందూ ధర్మాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంగీత దర్శకుడు ఆర్.పి. పట్నాయక్, లలిత్ కుమార్, కళ్యాణ్ కుమార్, కరుణాకర్, శ్రీనివాస్ యాదవ్, బీజేపీ జిల్లా అధ్యక్షుడు రమేష్ కుమార్, మాజీ జిల్లా అధ్యక్షుడు సదానంద రెడ్డి, స్థానిక సర్పంచ్ మానెమ్మ రాంరెడ్డి, సర్పంచులు కొండల్ యాదవ్, నరసింహారెడ్డి, దాన నర్సింలు, ప్రభాకర్, శ్రీనివాస్ రెడ్డి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు సామ వెంకట్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మేడిపల్లి వెంకటయ్య, నాయకులు ప్రభాకర్ రెడ్డి, అనంత రాములు, దగ్గుల శ్రీహరి, శ్రీకాంత్ రెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, శివచంద్ర రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల అండాల అక్రమ వ్యాపారంపై సమగ్ర దర్యాప్తు జరపాలి!

ఓబీసీ జాతీయ మహిళ అధ్యక్షురాలు వాణి రెడ్డి డిమాండ్



హైద్రాబాద్ నీలగిరి వార్త నవంబర్ 2 ;హైదరాబాద్‌లో మహిళల అండాల అక్రమ సేకరణ, విక్రయానికి సంబంధించిన దందా వెలుగులోకి రావడం పట్ల ఓబీసీ జాతీయ మహిళ అధ్యక్షురాలు వాణి రెడ్డి డిమాండ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. ఇతర రాష్ట్రాలకు చెందిన ఆర్థికంగా వెనుకబడిన మహిళలకు డబ్బు ఆశ చూపి హైదరాబాద్‌కు తీసుకువచ్చి, అండాల సేకరణకు ఉపయోగిం చుకున్నారనే ఆరోపణలు మహిళల ఆరోగ్యం, భద్రత, గౌరవానికి సంబంధించిన తీవ్రమైన అంశాలని అన్నారు. సరైన వైద్య పర్యవేక్షణ లేకుండా ఇటువంటి ప్రక్రియలు నిర్వహించడం మహిళల ప్రాణాలకు ముప్పుగా మారవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర దర్యాప్తు చేపట్టి, మధ్యవర్తులు, సంబంధిత ఫెర్టిలిటీ కేంద్రాలు, ఇతరుల పాత్రను నిష్పక్షపాతంగా విచారించాలని డిమాండ్ చేశారు. రక్షించిన మహిళలందరికీ అవసరమైన వైద్య పరీక్షలు, చికిత్స, మానసిక సహాయం అందించడంతోపాటు వారి వ్యక్తిగత వివరాలకు గోప్యత కల్పించాలని కోరారు.

దర్యాప్తులో బాధ్యులుగా తేలిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని వాణి రెడ్డి డిమాండ్ చేశారు.

మహిళల ఆర్థిక బలహీనతను ఆసరాగా చేసుకొని వారి శరీరాన్ని వ్యాపార వస్తువుగా మార్చే అక్రమాలకు తావులేకుండా, రాష్ట్ర ప్రభుత్వం పటిష్ఠమైన పర్యవేక్షణ వ్యవస్థను ఏర్పాటు చేయాలని వాణి రెడ్డి కోరారు.

4 వ తేదీన జరిగే సదర్ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా యాదవ సోదరులు కదలి రండి

శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ నేత రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్



హైద్రాబాద్ నవంబర్ 2;హైదరాబాద్ ఎన్టీఆర్ స్టేడియంలో నవంబర్ 4న నిర్వహించనున్న సదర్ ఉత్సవాలకు రాష్ట్రవ్యాప్తంగా యాదవ సోదరులు హాజరు కావాలని శ్రీకృష్ణ సదర్ సమ్మేళనం ఉత్సవ కమిటీ నేత

రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్ తెలిపారు. సోమవారం ఆదర్శ్ నగర్ ఎల్ ఎల్ ఏ క్యాటర్స్ లు ఏర్పాటు చేసిన మీడియా సమావేశం లో మాట్లాడుతూ ఈ సదర్ ఉత్సవాలను ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి 4 వ టిది ఉదయం 11 గంటలకు ప్రారంభిస్తారని తెలిపారు.

ప్రశ్నార్థకంగా మారుతున్న యువత భవితవ్యం



వికారాబాద్ నీలగిరి వార్త నవంబర్ 2; జాతిని క్యాన్సర్ మహమ్మారిల్లా పట్టిపీడిస్తున్న మాదక భూతాన్ని కట్టడి చేయడంలో అలసత్వం ఎంత మాత్రం సహించరానిది వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి అన్నారు. అభివృద్ధితో పాటు విస్తరిస్తున్న హైదరాబాద్ నగరంలో కార్పొరేట్ కల్చర్ పెరుగుతుంది. మధ్యము, మసాజులు, పబ్బులు, బార్లు, డాన్సులు సంస్కృతి కారణంగా మద్యం అమ్మకాలతో పాటు డ్రగ్స్ విక్రయాలకు నగరం కేంద్ర బిందువుగా మారుతుంది. వివిధ రకాల పేరుతో విదేశీ మార్కెట్లో లభించే మాదకద్రవ్యాలు నేరుగా హైదరాబాదుకు చేరుతున్నాయి. నైజీరియా, ఆఫ్రికా లాంటి దేశాల నుంచి ఇక్కడికి స్టూడెంట్ వీసాలపై వచ్చి మత్తుమందు వ్యాపారాన్ని విస్తరిస్తున్నారు. హెరాయిన్, చరాస్, కోకైన్ లాంటి డ్రగ్స్ ను అక్కడ నుండి దిగుమతి చేస్తూ, ఓపియం, గంజాయి లాంటి మాదకద్రవ్యాలను విక్రయించి విద్యార్థుల జీవితాలతో ఆడుకుంటున్నారు అని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి తెలిపారు. విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్ మహమ్మారిని మన దేశం నుంచి తరిమి కొట్టడానికి విద్యార్థులతో కలిసి "నశా ముక్త భారత్ అభియాన్ " ర్యాలీలను మరియు అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థుల లోను మరియు వారి తల్లిదండ్రుల్లో చైతన్యాన్ని కల్పించాలని ఉద్దేశంతో జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ జిల్లావ్యాప్తంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు సాయి చౌదరి తెలిపారు.

బానిసలు అవుతున్న యువత

నైజీరియా, గణ లాంటి ఆఫ్రికా దేశాల నుంచి విద్యార్థులు అత్యధికంగా స్టూడెంట్ వీసా పై నగరానికి వస్తున్నారు. వారు అలవాట్లు, ఖర్చులకు డబ్బు సరిపోకపోవడంతో అడ్డదారు తొక్కుతున్నారు. వారి దేశాలలో విరివిగా లభించే మాదకద్రవ్యాలను ఇక్కడికి తీసుకొస్తున్నారు. గోవా, ముంబై ప్రాంతాల్లో ఉన్న బడా స్మగ్లర్ల ద్వారా కోకైన్, హెరాయిన్ లాంటి వాటిని నగరానికి తరలించి వారు వాడటమే కాకుండా, ఇక్కడ యువతకు దాని రుచి చూపించి వారిని మాదగ ద్రవ్యాలకు బానిసలుగా చేస్తున్నారు అలవాటు పడిన తర్వాత దాని కొనుగోలు చేయడానికి డబ్బులు లేకపోవడం లేదా లాభార్జన కోసం యువత డ్రగ్స్ వ్యాపారం చేయడానికి కూడా వెనకాడడం లేదని సాయి చౌదరి తెలిపారు.

స్టేటస్ పేరిట దగా

వందల రూపాయలకు లభించే మద్యంలో ఏముంది? వేల రూపాయలు వెచ్చించి ఒక గ్రాము డ్రగ్ కొనుగోలు చేసి తీసుకుంటే ఆ టీవీ, దర్జాయే వేరని వారు చెప్పే మాటలు నమ్మి కొంతమంది ధనవంతుల పిల్లలు ఈ మాయా ప్రపంచంలోకి ప్రవేశిస్తున్నారు. మరికొందరు సంపన్నులు కూడా దీని బారిన పడుతున్నారు. ముందుగా ఫ్రీగా శాంపిల్స్ ఇస్తారు. దాని రుచి చూసిన తర్వాత వారిని బ్లాక్ మెయిల్ చేసి అధిక ధరలకు విక్రయిస్తారు. అవసరమైతే అడ్వాన్స్ బుకింగ్ పేరిట కూడా ఈ దశేదా సాగుతుందని సమాచారం.

ఫంక్షన్ లే టార్గెట్

మాదకద్రవ్యాలకు అలవాటు పడిన వ్యక్తి కస్టమర్ గా మారిన తర్వాత కొత్త కస్టమర్ల కోసం డ్రగ్స్ సరఫరాదారులు ప్రణాళికలు రక్షిస్తూనే ఉంటారు. కాలేజీ ఫంక్షన్లు, ఇతర ప్రధాన కార్యక్రమాలు జరిగినప్పుడు డ్రగ్స్ అధిక మొత్తంలో తెప్పించి సరఫరా చేయడమే కాకుండా కొత్త కస్టమర్లను వెతికేందుకు ఈ కార్యక్రమాలను వేదికలుగా మలుచుకుంటున్నారు. మాదకద్రవ్యాల నిషేధాన్ని కఠినముగా అమలు చేసేందుకు పోలీసులు మరిన్ని చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందని వికారాబాద్ జిల్లా రెడ్ క్రాస్ సొసైటీ చైర్మన్ సాయి చౌదరి పేర్కొన్నారు.



దీంతో ఎలాంటి లాభాలు కలుగుతాయంటే..?

ప్రస్తుతం మెడికవర్ ఇండియా విలువ 1.2 బిలియన్ల యూరోలు. 2017లో ప్రారంభమైన మెడికవర్ హాస్పిటల్.. దేశవ్యాప్తంగా 24 దవాఖానల్లో 4,800 పడకలను నిర్వహిస్తున్నది. ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడానికి ఈ పెట్టుబడులు పెట్టినట్టు, దీంతో మెడికవర్ ఇండియా డాక్టర్లు, ఉద్యోగులకు మరింత లాభదాయకంగా ఉంటుందని కేకేఆర్ ఇండియా హెడ్ అక్షయ్ తన్నా తెలిపా రు. మెడికవర్ ఇండియాలో 80 క్లినికల్ స్పెషాల్టీలు, 1,900 మంది డాక్టర్లు, అడ్వాన్స్‌డ్ క్లినికల్ మౌలిక సదుపాయాల టెక్నాలజీ ఉన్నది. దేశీయ ఆరోగ్య సంరక్షణ వ్యవస్థకు దీర్ఘకాలిక అభివృద్ధిపై తమకున్న నమ్మకానికి ఈ పెట్టుబడులు నిదర్శనమన్నారు.

తలనొప్పి సమస్య అసలు ఎందుకు వస్తుంది..

ఆయుర్వేదంలో ఎలాంటి చిట్కాలు ఉన్నాయి..?



తలనొప్పి చాలా మందిని తరచూ ఇబ్బంది పెట్టే సాధారణ ఆరోగ్య సమస్య. ఇంట్లో ఉన్నా, కార్యాలయంలో ఉన్నా లేదా ప్రయాణంలో ఉన్నా తలనొప్పి రోజువారీ పనులపై ప్రభావం చూపుతుంది. చాలామంది ఒక కప్పు కాఫీ తాగడం లేదా కొద్దిసేపు విశ్రాంతి తీసుకోవడం ద్వారా తలనొప్పి తగ్గిపోతుందని భావిస్తారు. అయితే ప్రతిసారి అలా జరగదు. ఆయుర్వేదంలో తలనొప్పి నుంచి ఉపశమనం పొందేందుకు కొన్ని సహజమైన ఆహారాలు, ఇంటి చిట్కాలు ఉన్నాయి. ఆయుర్వేదం ప్రకారం తలకు సున్నితంగా మసాజ్ చేయడం తలనొప్పి తగ్గించడంలో సహాయపడుతుంది. ముఖ్యంగా శరీరంలో నీటి కొరత (డీహైడ్రేషన్) వల్ల వచ్చే పిత్త సంబంధిత తలనొప్పుల్లో తరచూ నీరు లేదా ఆరోగ్యకరమైన పానీయాలు తీసుకోవడం మంచిదని సూచిస్తోంది. అలాగే జలుబు, దగ్గు కారణంగా ముక్కు మూసుకుపోయి తలనొప్పి వస్తే, ఆయుర్వేద మూలికల నూనె లేదా నెయ్యిని ముక్కు రంధ్రాలలో వేయడం ద్వారా ఉపశమనం లభిస్తుంది.

బ్రాహ్మి, చందనం..

బ్రాహ్మి తలనొప్పిని తగ్గించడంలో ఉపయోగపడే ముఖ్యమైన ఆయుర్వేద మూలికగా చెప్పవచ్చు. ఇది శరీరానికి చల్లదనాన్ని అందించడంతోపాటు ఒత్తిడి, మానసిక ఆందోళనను తగ్గించడంలో సహాయపడుతుంది. బ్రాహ్మి నూనెతో తలకు మసాజ్ చేయడం లేదా బ్రాహ్మి, నెయ్యి చుక్కలను ముక్కులో వేయడం వల్ల తలనొప్పి నుంచి ఉపశమనం లభించే అవకాశం ఉంటుంది. చందనం కూడా తలనొప్పికి ఉపయోగించే సంప్రదాయ చికిత్సల్లో ఒకటి. అర టీస్పూన్ చందనం పొడిలో కొద్దిగా నీరు కలిపి పేస్ట్ లా తయారుచేసి నుదుటిపై రాసి సుమారు 20 నిమిషాలు ఉంచితే చల్లదనాన్ని అందించి తలనొప్పిని తగ్గించడంలో సహాయపడుతుంది. తగర్ అనే ఔషధ మూలికను కూడా ఆయుర్వేదంలో ఉపయోగిస్తారు. ఈ మూలికతో తయారైన ఔషధ నూనెతో మసాజ్ చేయడం లేదా టీ రూపంలో తీసుకోవడం వల్ల కొంత ఉపశమనం పొందవచ్చు.

చిన్న యాలకులు, రాక్ సాల్ట్..

చిన్న యాలకులను నమలడం కూడా కొన్ని రకాల తలనొప్పులను తగ్గించడంలో ఉపయోగపడుతుంది. అలాగే సాధారణ ఉప్పుకు బదులుగా రాక్ సాల్ట్ వాడడం కొందరికి ప్రయోజనకరంగా ఉంటుంది. గోరువెచ్చని నీటిలో చిటికెడు రాక్ సాల్ట్ కలిపి తాగడం కూడా కొన్ని రకాల తలనొప్పులకు ఉపశమనం కలిగిస్తుంది. ఆయుర్వేదం ప్రకారం తలనొప్పిని వాత, పిత్త, కఫ అనే మూడు రకాలుగా వర్గీకరిస్తారు. ఏ రకమైన తలనొప్పో గుర్తిస్తే దానికి తగిన చికిత్సను ఎంచుకోవడం సులభమవుతుంది.



గుండె ఆరోగ్యానికి అండ.. ద్రాక్ష..

ద్రాక్ష పండ్లను పండ్ల రాణిగా పిలుస్తారు. రుచికరమైన తీపి, స్వల్ప పులుపు కలిగిన ఈ పండ్లు ఆరోగ్యానికి ఎన్నో ప్రయోజనాలు అందిస్తాయి. ప్రపంచవ్యాప్తంగా పచ్చ, ఎరుపు, నీలం, ఊదా, నలుపు వంటి వివిధ రంగుల్లో లభించే ద్రాక్షను ఎక్కువగా వైన్ తయారీలో ఉపయోగిస్తారు. మిగిలిన వాటిని నేరుగా పండ్లుగా లేదా ఎండు ద్రాక్ష తయారీలో వినియోగిస్తారు. ఏడాది పొడవునా మార్కెట్లో లభించే ఈ పండ్లు పోషకాలు, యాంటీఆక్సిడెంట్లతో సమృద్ధిగా ఉండి శరీరానికి అనేక విధాలుగా మేలు చేస్తాయి. ద్రాక్షలో కెరోటినాయిడ్లు, పాలీఫినాల్స్ వంటి అనేక రకాల ఫైటోన్యూట్రియెంట్లు, శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్లు ఉంటాయి. ఇవి శరీర కణాలను ఫ్రీ రాడికల్స్ వల్ల కలిగే నష్టాల నుంచి రక్షించడంలో సహాయపడతాయి. కొన్ని పరిశోధనల ప్రకారం ఇవి కొన్ని రకాల క్యాన్సర్ల ప్రమాదాన్ని తగ్గించడంలో, గుండె ఆరోగ్యాన్ని కాపాడడంలో ఉపయోగపడతాయని తేలింది. ముఖ్యంగా ద్రాక్షలో ఉండే రెస్వెరాట్రోల్ అనే పాలీఫినాల్ రక్తనాళాలను విస్తరింపజేసి రక్తప్రసరణను మెరుగుపరచడంలో, రక్తపోటును తగ్గించడంలో సహాయపడుతుందని అధ్యయనాలు సూచిస్తున్నాయి. ద్రాక్ష గింజలు, తొక్కలో యాంటీ ఆక్సిడెంట్లు అత్యధికంగా ఉంటాయని పరిశోధనలు వెల్లడించాయి.

గుండె ఆరోగ్యానికి..

ద్రాక్షలోని రెస్వెరాట్రోల్ చర్మ ఆరోగ్యానికి కూడా మేలు చేస్తుందని పరిశోధనలు చెబుతున్నాయి. ఇది వృద్ధాప్య లక్షణాలు ఆలస్యంగా కనిపించడానికి తోడ్పడటంతోపాటు కొన్ని చర్మ సమస్యలను తగ్గించడంలో సహాయపడుతుంది. ఒక అధ్యయనం ప్రకారం బెంజాయిల్ పెరాక్సైడ్ అనే సాధారణ మొటిమల మందుతో కలిపి ఉపయోగించినప్పుడు రెస్వెరాట్రోల్ మొటిమలకు కారణమయ్యే బ్యాక్టీరియాపై ప్రభావవంతంగా పనిచేసినట్లు గుర్తించారు. 100 గ్రాముల ద్రాక్షలో సుమారు 191 మిల్లీగ్రాముల పొటాషియం ఉంటుంది. పొటాషియం అధికంగా తీసుకోవడం, సోడియం వినియోగాన్ని తగ్గించడం వల్ల రక్తపోటు, అధిక కొలెస్ట్రాల్ వంటి సమస్యలను నియంత్రించడంలో సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు.తగ్గించడంలో కూడా ఉపయోగపడుతుంది.

గోర్లలో ఈ లక్షణాలు కనిపిస్తే జాగ్రత్త..



ఆరోగ్యంగా ఉండాలంటే వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం చాలా ముఖ్యం. గోర్లను క్రమం తప్పకుండా కత్తిరించడం, శుభ్రంగా ఉంచడం ద్వారా అనేక ఇన్‌ఫెక్షన్లను నివారించవచ్చు. అదే సమయంలో గోర్లలో కనిపించే చిన్నచిన్న మార్పులు కూడా శరీరంలోని అంతర్గత ఆరోగ్య పరిస్థితిని సూచించే అవకాశం ఉంటుంది. పాలిపోయినట్లు తెల్లగా ఉంటే..

గోర్లు పాలిపోయినట్లు లేదా తెల్లగా కనిపిస్తే అది రక్తహీనత (అనీమియా), పోషకాహార లోపం లేదా కాలేయానికి సంబంధించిన సమస్యలకు సంకేతంగా ఉంటుంది. ఈ లక్షణం ఎక్కువకాలం కొనసాగితే వైద్య పరీక్షలు చేయించుకోవడం మంచిది. గోర్లు ఎక్కువ భాగం తెల్లగా ఉండి, అంచులు మాత్రం ముదురు రంగులో కనిపిస్తే అది కొన్ని కాలేయ వ్యాధులతో సంబంధం కలిగి ఉండే అవకాశం ఉంటుందని నిపుణులు సూచిస్తున్నారు. గోర్లు పసుపు రంగులోకి మారడం వెనుక అత్యంత సాధారణ కారణం ఫంగల్ ఇన్‌ఫెక్షన్. ఇన్‌ఫెక్షన్ తీవ్రత పెరిగే కొద్దీ గోరు మందంగా మారడం,గోరు పెళుసుగా మారి ముక్కలుగా విరిగిపోవడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.

గమనిస్తే కొన్ని వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది. అయితే గోళ్లలో మార్పులు కనిపించాయంటే తప్పనిసరిగా తీవ్రమైన వ్యాధే ఉందని అర్థం కాదు. కానీ అవి ఎక్కువకాలం కొనసాగితే వైద్యులను సంప్రదించడం మంచిది. గోర్లు శుభ్రంగా, ఆరోగ్యంగా గోర్లు మన శరీర ఆరోగ్యానికి అద్దంలా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గోర్ల రంగు, ఆకారం లేదా వాటి ఉపరితలంలో కనిపించే మార్పులు కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. గోర్లలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా గమనిస్తే కొన్ని వ్యాధులను ముందుగానే గుర్తించే అవకాశం ఉంటుంది.

గోర్లు మన శరీర ఆరోగ్యానికి అద్దంలా పనిచేస్తాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. గోర్ల రంగు, ఆకారం లేదా వాటి ఉపరితలంలో కనిపించే మార్పులు కొన్ని ఆరోగ్య సమస్యలకు సంకేతాలుగా ఉంటాయి. గోర్లలో కనిపించే అసాధారణ లక్షణాలను నిర్లక్ష్యం చేయకుండా

షారుఖ్ ఖాన్ పుట్టినరోజు కానుక.. ‘

కింగ్’ నుంచి తొలి పాట విడుదల, రొమాన్స్‌తో పాటు యాక్షన్ అదుర్స్




బాలీవుడ్ బాద్‌షా షారుఖ్ ఖాన్ తన 61వ పుట్టినరోజు సందర్భంగా అభిమానులకు ప్రత్యేక కానుక అందించారు. ఆయన నటిస్తున్న అత్యంత ప్రతిష్ఠాత్మక చిత్రం ‘కింగ్’ నుంచి తొలి పాట ‘తూ మిల్ జాయే’ను చిత్రబృందం విడుదల చేసింది. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ సినిమాలో షారుఖ్ సరసన దీపికా పదుకొణే కథానాయికగా నటిస్తున్నారు. రొమాన్స్, యాక్షన్ అంశాలను కలగలిపి రూపొందించిన ఈ పాట విడుదలైన వెంటనే ప్రేక్షకుల దృష్టిని ఆకర్షిస్తోంది. ‘తూ మిల్ జాయే’ పాట ప్రారంభంలోనే షారుఖ్ ఖాన్ తనదైన శైలిలో చెప్పిన డైలాగ్ ఆకట్టుకుంటోంది. “నేను హంతకుడిని కాదు.. ప్రేమికుడిని” అంటూ ఆయన చెప్పే మాటలతో పాట మొదలవుతుంది. ఆ తర్వాత ప్రకృతి అందాల మధ్య షారుఖ్, దీపికా పదుకొణే మధ్య సాగే రొమాంటిక్ సన్నివేశాలు కనువిందు చేస్తాయి.ఇదే సమయంలో ప్రత్యర్థులతో షారుఖ్ తలపడే యాక్షన్ దృశ్యాలను కూడా పాటలో చూపించారు. చివర్లో ఆయన చెప్పే “ఈసారి గుండెల్లో మంట రగిలింది.. ఇప్పుడు ప్రపంచాన్ని తగలబెట్టకుండా ఆగదు” అనే డైలాగ్ సినిమాపై ఆసక్తిని పెంచుతోంది. మొత్తంగా ఈ పాటలో ప్రేమ, భావోద్వేగాలు, యాక్షన్‌కు సమాన ప్రాధాన్యం ఇచ్చినట్లు కనిపిస్తోంది. ఈ పాటకు సచిన్--జిగర్ సంగీతం అందించారు. అరిజిత్ సింగ్, మధుబంతి బాగ్చి తమ గాత్రంతో పాటకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచారు. అంతర్జాతీయ పాప్ గాయకుడు ఎడ్ షీరన్ ఇంగ్లీష్ ర్యాప్‌తో పాటలో కనిపించడం మరో విశేషం. కుమార్ సాహిత్యం అందించగా, పీయూష్--షాజియా కొరియోగ్రఫీ చేశారు.షారుఖ్, దీపికా మధ్య కెమిస్ట్రీతో పాటు పాటలోని సంగీతం, యాక్షన్ దృశ్యాలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి. తొలి పాటతోనే ‘కింగ్’ సినిమాపై అంచనాలు మరింత పెరిగాయి. ‘ఓం శాంతి ఓం’, ‘చెన్నై ఎక్స్‌ప్రెస్’, ‘హ్యాపీ న్యూ ఇయర్’, ‘పఠాన్’, ‘జవాన్’ చిత్రాల తర్వాత షారుఖ్ ఖాన్, దీపికా పదుకొణే కలిసి నటిస్తున్న మరో సినిమా ‘కింగ్’. ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌లో షారుఖ్ కుమార్తె సుహానా ఖాన్, అభిషేక్ బచ్చన్‌తో పాటు పలువురు ప్రముఖ నటీనటులు కీలక పాత్రల్లో కనిపించనున్నారు. రెడ్ చిల్లీస్ ఎంటర్‌టైన్‌మెంట్, మార్ఫ్లిక్స్ పిక్చర్స్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. సిద్ధార్థ్ ఆనంద్ దర్శకత్వం వహిస్తున్న ‘కింగ్’ ప్రపంచవ్యాప్తంగా 2026 డిసెంబర్ 24న థియేటర్లలో విడుదల కానుంది. షారుఖ్ పుట్టినరోజు సందర్భంగా తొలి పాటను విడుదల చేయడంతో అభిమానుల్లో ఉత్సాహం నెలకొంది.

సినిమా న్యూస్

గ్లామర్ డోస్ పెంచేసిన హెబ్బా పటేల్..

బ్లాక్ అవుట్‌ఫిట్‌లో బోల్డ్ ఫొటోషూట్!



ప్రేమలో దారుణంగా మోసపోయా, డిప్రెషన్‌లోకి వెళ్లా..



గ్లామరస్ పాత్రలకే పరిమితం కాకుండా, విభిన్నమైన కథలు, పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కసాండ్రా. కథానాయికగా మాత్రమే కాకుండా ప్రతినాయిక ఛాయలున్న పాత్రల్లోనూ నటిస్తూ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నారు. ప్రస్తుతం నయనతార ప్రధాన పాత్రలో తెరకెక్కిన ‘మూకుత్తి అమ్మన్ 2’ సినిమాలో కీలకమైన ప్రతికూల ఛాయలున్న పాత్రలో కనిపించనున్నారు. తెలుగులో ఈ చిత్రం ‘మహాశక్తి’ పేరుతో విడుదల కానుంది. ఈ సినిమా ప్రచార కార్యక్రమాల్లో పాల్గొన్న రెజీనా తన వ్యక్తిగత జీవితానికి సంబంధించిన కొన్ని ఆసక్తికర విషయాలను వెల్లడించారు. గతంలో ప్రేమలో ఎదురైన చేదు అనుభవం తనను ఎంతగా కుంగదీసిందో వివరించారు. తన గత ప్రేమ బంధం గురించి మాట్లాడుతూ.. 2020లో తన జీవితంలో ఊహించని సంఘటన చోటుచేసుకుందని రెజీనా వెల్లడించారు.

రూ.800 కోట్ల క్లబ్‌లోకి ‘జైలర్ 2’.



సూపర్‌స్టార్ రజనీకాంత్ బాక్సాఫీస్ వద్ద మరోసారి తన సత్తా చాటారు. నెల్సన్ దిలీప్‌కుమార్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ చిత్రం ‘జైలర్ 2’ ప్రపంచవ్యాప్తంగా భారీ వసూళ్లతో దూసుకెళ్తోంది. విడుదలైన 18 రోజుల్లోనే ఈ సినిమా రూ.800 కోట్ల మార్కును దాటినట్లు ట్రేడ్ లెక్కలు వెల్లడిస్తున్నాయి. దీంతో ఈ మైలురాయిని అందుకున్న తొలి తమిళ చిత్రంగా ‘జైలర్ 2’ నిలిచినట్లు ప్రచారం జరుగుతోంది. 75 ఏళ్ల వయసులోనూ రజనీకాంత్‌కు ఉన్న క్రేజ్ ఏ మాత్రం తగ్గలేదని ఈ వసూళ్లు మరోసారి నిరూపిస్తున్నాయి. మూడో వారాంతంలోనూ ‘జైలర్ 2’ వసూళ్ల జోరు కొనసాగింది. నవంబర్ 1 ఆదివారం 18వ రోజు దేశవ్యాప్తంగా సుమారు 8,906 ప్రదర్శనల ద్వారా రూ.11.20 కోట్ల నికర వసూళ్లు సాధించినట్లు ట్రేడ్ నివేదికలు వెల్లడించాయి. అంతకుముందు శనివారం వచ్చిన రూ.9.70 కోట్లతో పోలిస్తే ఆదివారం వసూళ్లు దాదాపు 15.5 శాతం పెరిగాయి.
దీంతో భారతదేశంలో ఈ సినిమా మొత్తం నికర వసూళ్లు రూ.456.30 కోట్లకు చేరగా, దేశీయంగా రూ.533.75 కోట్ల గ్రాస్ నమోదైంది. ప్రపంచవ్యాప్తంగా మొత్తం గ్రాస్ వసూళ్లు రూ.807.25 కోట్లకు చేరినట్లు అంచనా. ఆదివారం ఒక్కరోజే తమిళ వెర్షన్ నుంచి సుమారు రూ.8 కోట్లు వచ్చాయి. హిందీ వెర్షన్ రూ.1.75 కోట్లు, తెలుగు వెర్షన్ దాదాపు రూ.1 కోటి వసూలు చేసినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి. తమిళనాడులో మధ్యాహ్నం, సాయంత్రం ప్రదర్శనలకు 42 నుంచి 45 శాతం వరకు ప్రేక్షకుల ఆక్యుపెన్సీ నమోదైంది.
భారతీయ బాక్సాఫీస్‌లో అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రాల జాబితాలో ‘జైలర్ 2’ 16వ స్థానానికి చేరినట్లు ట్రేడ్ లెక్కలు చెబుతున్నాయి. ఈ క్రమంలో ‘2.0’, ‘బాహుబలి: ది బిగినింగ్’, ‘సలార్: పార్ట్ 1’, ‘దంగల్’, ‘అవతార్: ది వే ఆఫ్ వాటర్’ వంటి చిత్రాల దేశీయ వసూళ్లను అధిగమించినట్లు సమాచారం.
2026లో విడుదలైన భారతీయ చిత్రాల్లో ‘ధురంధర్: ది రివెంజ్’ తర్వాత అత్యధిక వసూళ్లు సాధించిన రెండో చిత్రంగా కూడా ‘జైలర్ 2’ నిలిచినట్లు ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. ‘జైలర్ 2’ విడుదలైన సమయంలో ఈ సినిమా ప్రపంచవ్యాప్తంగా రూ.1000 కోట్ల వసూళ్లను సాధిస్తుందనే అంచనాలు భారీగా వినిపించాయి. అయితే మూడో వారం నుంచి వసూళ్ల వేగం కొంత తగ్గడంతో ఆ మైలురాయిని అందుకోవడం కష్టంగా కనిపిస్తోంది. అయినప్పటికీ రూ.800 కోట్లకు పైగా వసూళ్లు సాధించడం తమిళ చిత్ర పరిశ్రమకు గర్వకారణంగా నిలుస్తోంది.యోగిబాబు, నమో నారాయణ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. అనిరుధ్ రవిచందర్ అందించిన సంగీతం, నేపథ్య సంగీతం సినిమాకు ప్రధాన ఆకర్షణగా నిలిచాయి.

విశ్వక్ సేన్‌కు ‘కల్ట్’ డబుల్ షాక్..

‘లైలా’ కంటే తక్కువ వసూళ్లు,

ఇకపై సినిమాల ఎంపికే కీలకం!



మాస్ కా దాస్ విశ్వక్ సేన్‌కు కొంతకాలంగా బాక్సాఫీస్ వద్ద ఆశించిన విజయాలు దక్కడం లేదు. విభిన్న కథలు, కొత్త తరహా ప్రయోగాలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నప్పటికీ, వరుస పరాజయాలు ఆయన కెరీర్‌పై ప్రభావం చూపుతున్నాయి. ముఖ్యంగా ‘లైలా’ వంటి భారీ నిరాశ తర్వాత తన స్వీయ దర్శకత్వంలో తెరకెక్కించిన ‘కల్ట్’ సినిమాపై విశ్వక్ ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. తెలుగు ప్రేక్షకులకు సరికొత్త స్లాషర్ జానర్‌ను పరిచయం చేస్తున్నానంటూ ప్రచార కార్యక్రమాల్లో ఈ సినిమాపై భారీ అంచనాలు పెంచారు. కానీ విడుదలైన మొదటి రోజే ఈ చిత్రానికి ప్రతికూల స్పందన రావడంతో విశ్వక్‌కు మరోసారి నిరాశ ఎదురైంది.విశ్వక్ సేన్ హీరోగా నటిస్తూ దర్శకత్వం వహించిన ‘కల్ట్’ శుక్రవారం థియేటర్లలో విడుదలైంది. యూత్‌ను ప్రధానంగా లక్ష్యంగా చేసుకుని రూపొందించిన ఈ చిత్రం ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని చిత్రబృందం ఆశించింది. అయితే విడుదలైన వెంటనే సినిమాకు ప్రతికూల స్పందన మొదలైంది. అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. మొదటి రోజు వచ్చిన స్పందన తర్వాత వారాంతంలో అయినా వసూళ్లు పుంజుకుంటాయని ఆశించినప్పటికీ, అలాంటి పరిస్థితి కనిపించలేదని ట్రేడ్ వర్గాల అంచనాలు చెబుతున్నాయి.

Printed by HAMARA WARANGAL PRINTERS AND GRAPHICS Published by GUNDLA SRINIVAS on behalf of GUNDLA SRINIVAS, printed at WARANGAL and published at H-NO: 2-55, PEDDAPUR VENKATAPUR MANDAL, PEDDAPUR, WARANGAL, TELANGANA - 506168. editor CHENNA RAMA KRISHNA.9573317147,8096914960